ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 2 నవంబరు 2024

దీపం వెలుగులు

ఉచిత వంట గ్యాస్‌తో మహిళల్లో హర్షాతిరేకాలు

- దీపం-2 పథకాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- జిల్లా అంతటా పండుగ వాతావరణం
- తొలి జాబితాలో 3,60,125 మందికి అర్హత
- ఈ-కేవైసీతో అర్హులందరికీ పథకం అమలు



దీపం పథకం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న హోం మంత్రి వి.అనిత

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కటొక్కటిగా అమలు చేస్తుండడంతో ఆయా వర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సూపర్-6 హామీల్లో ఒకటైన ఉచిత వంటగ్యాస్ పథకాన్ని శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉచిత వంటగ్యాస్ పథకం 'దీపం-2' ప్రారంభం ఒక పండుగలా జరిగింది. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొని, పలువురు మహిళలకు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ సందర్భంగా మహిళల మోముల్లో సంతోషం వెల్లివిరిసింది.

పేదింటి మహిళలకు ఉచిత వంట గ్యాస్ పంపిణీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రారంభించింది. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6 హామీల్లో ఒకటైన ఉచిత వంట గ్యాస్ పథకాన్ని (దీపం-2) దీపావళి పండుగ కానుకగా అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద వంట గ్యాస్ బుకింగ్‌ను రెండు రోజుల క్రితమే ప్రారంభించగా, శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అమల్లోకి తీసుకువచ్చారు.

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. ఏటా ఒక్కో కుటుంబానికి మూడు చొప్పున గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని, ఇందుకోసం రానున్న ఐదేళ్లకాలంలో రూ.11 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని చెప్పారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 81,274 కుటుంబాలు లబ్ధిపొందుతాయని ఆయన తెలిపారు. అనకాపల్లిలోని గాంధీ నగరంలో జిల్లా ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి దీపం-2 పథకాన్ని ప్రారంభించి రమణమ్మ అనే లబ్ధిదారునికి గ్యాస్ సిలిండర్ అందజేశారు. అనంతరం ఆమె ఇంట్లో కలెక్టర్ టీ తయారు చేశారు.

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

జిల్లా పౌర సరఫరాల శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 5,17,081 మంది తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరిలో ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం-2 పథకం కింద మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు పొందడానికి తొలి జాబితాలో 3,60,125 మంది కార్డుదారులు ఎంపికయ్యారు. అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా దీపం-2 లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తే.. అనకాపల్లిలో 67,364 మంది, పాయకరావు పేటలో 59,885, నర్సీపట్నంలో 81,269, ఎలమంచిలిలో 32,536, చోడవరంలో 46,266, మాడుగులలో 45,543, పెందుర్తి నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో 27,262 మంది వున్నారు. మిగిలిన 1,56,956 మంది రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్, బ్యాంకు ఖాతాతో ఫోన్ నంబరు అనుసంధానం చేసుకుంటే అర్హుల జాబితాలో చేర్చనున్నారు.

అన్ని అర్హతలుంటే పథకం వర్తింపు

జిల్లాలో దీపం-2 పథకం లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతున్నదని, ఈ-కేవైసీ కానివారు గ్యాస్ ఏజెన్సీలకు వెళ్లి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి మూర్తి తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు వున్నవారిలో కొంతమంది ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోనందున ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. తొలి జాబితాలో పేర్లు లేనివారు సమీపంలోని సచివాలయానికి వెళ్లి ఆధారాలు అందించి దీపం-2 పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక ఆసరా



కూటమి ప్రభుత్వం ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇచ్చే 'దీపం-2' పథకాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా వుంది. సిలిండర్ల ఖర్చును ప్రభుత్వం భరించడం వల్ల పేద కుటుంబాలకు ఆర్థిక ఆసరా లభిస్తుంది. పరిపాలనలో సుదీర్ఘ అనుభం వున్న చంద్రబాబు వంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా వుంటే పేదలకు మరెన్నో ప్రయోజనాలు చేకూరతాయి. దీపం-2 పథకం ద్వారా కోట్లాది పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.

- ఆడారి రమణమ్మ, ఎలమంచిలి తులసీనగర్

చాలా ఆనందంగా ఉంది



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుండడం, వాటి వల్ల మావంటి పేద కుటుంబాలకు లబ్ధి చేకూరుతుండడం ఎంతో ఆనందంగా వుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారు. ఇప్పుడు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం పాలనపట్ల మహిళలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఉప్పలపు నారాయణమ్మ, అంజయ్యకాలనీ, అనకాపల్లి

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

- విమానాశ్రయం నుంచి శ్రీకాకుళం పర్యటనకు పయనం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పర్యటన నిమిత్తం శుక్రవారం ఉదయం 11.20 గంటలకు విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. అనంతరం ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో శ్రీకాకుళం బయలుదేరి వెళ్లారు.

నేడు జిల్లాకు చంద్రబాబు?

లంకెలపాలెం-అసకపల్లి రోడ్డు పనులు ప్రారంభించనున్న సీఎం

అనకాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం లంకెలపాలెం నుంచి సబ్బవరం మండలం అసకపల్లి వెళ్లే రోడ్డు మరమ్మతు పనులను ఆయన ప్రారంభించనున్నారు. అనంతరం విశాఖపట్నంలో అధికారుల సమీక్ష సమావేశానికి హాజరు కానున్నారు. వాస్తవానికి చంద్రబాబు విజయనగరంలోని రోడ్డు మరమ్మతు పనుల ప్రారంభానికి హాజరుకావాల్సి ఉండగా వాతావరణం సహకరించక పోవడంతో అనకాపల్లి జిల్లాకు మార్చినట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు తెలిపారు. అయితే సీఎంఓ నుంచి అధికారికంగా టూర్ షెడ్యూల్ విడుదల కాలేదు.

దీపాంజలినగర్‌లో భారీ చోరీ

- 37 తులాల బంగారం ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరణ
- తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో చోరీ

పరవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన దీపాంజలినగర్‌లో భారీ చోరీ జరిగింది. తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లల్లో దొంగలు ప్రవేశించి 37 తులాల బంగారు ఆభరణాలతోపాటు ఒక వెండి చెంబు, రూ.20 వేల నగదు అపహరించుకుపోయారు. ఇందుకు సంబంధించి సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కె.వెంకట పవన్ సాయికుమార్ సింహాద్రి ఎన్టీపీసీలోఉద్యోగం చేస్తూ దీపాంజలినగర్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. దీపావళి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 30వ తేదీన స్వస్థలానికి వెళ్లారు. పండుగ ముగించుకుని శుక్రవారం ఇంటికి చేరుకున్నారు. ప్రధాన ద్వారం తాళాలు పగుల గొట్టి ఉండడాన్ని గుర్తించి ఆందోళన చెందారు. లోపలికి వెళ్లి చూడగా.. బెడ్ రూమ్ తాళాలు పగులగొట్టి ఉండడంతోపాటు బీరువా తెరిచి ఉంది. ఇందులో భద్రపరిచిన 29 తులాల బంగారం ఆభరణాలు, వెండి చెంబు కనిపించలేదు. అలాగే సింహాద్రి ఎన్టీపీసీలోపనిచేస్తున్న మరో ఉద్యోగి ఎం.ప్రదీప్ దీపాంజలినగర్‌లోనే నివాసం వుంటున్నారు. ఇతను కూడా కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 30న స్వస్థలానికి వెళ్లి శుక్రవారం ఇంటికి చేరుకున్నారు. ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉండడంతోపాటు బెడ్‌రూములోని బీరువాను పగులగొట్టి వుంది. ఇందులో భద్రపరిచిన ఎనిమిది తులాల బంగారం ఆభరణాలతో పాటు రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. బాధితులు ఇరువురూ శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండిళ్లల్లో ఒకే తరహాలో చోరీలు జరగడంతో ఒకే ముఠా పాల్పడి వుంటుందని పోలీసులు భావిస్తున్నారు.

సీఐ మల్లికార్జునరావు, సిబ్బందితో దీపాంజలినగర్ వెళ్లి చేరుకుని చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించారు. స్థానికులే దొంగతనానికి పాల్పడి ఉండొచ్చనని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

పందూరులో ఇసుక వేలం పాట

అధికార, ప్రతిపక్ష నేతలు కుమ్మక్కు

రూ.17.2 లక్షలకు పాడుకున్న వైసీపీ నేత

కోటవురట్ల, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి):



పందూరు వద్ద వరహా నదిలో ఇసుక తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గోతులు

మద్యం బెల్టుషాపులకు వేలం పాటలు నిర్వహించిన తరహాలోనే మండలంలోని పందూరు గ్రామంలో ఇసుక తవ్వకాలకు వేలం పాట నిర్వహించారు. వరహా నదిలో ఇసుక తవ్వి, అమ్ముకునేందుకు గ్రామ పెద్ద గత బుధవారం గ్రామంలోని రామాలయంలో వేలం పాట నిర్వహించారు. వైసీపీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఒకరు రూ.17.2 లక్షలకు పాడుకున్నట్టు తెలిసింది. ఈ సొమ్మును గ్రామంలో అభివృద్ధి పనులతోపాటు గ్రామదేవత ఉత్సవాలకు వినియోగిస్తామని పెద్దలు చెబుతున్నారున

మండలంలో సర్పా, వరహా నదుల్లో గొట్టివాడ, పందూరు, చౌడువాడ ప్రాంతాల్లో ఇసుక నిల్వలు పుష్కలంగా వున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలతో నదుల్లో వరద ఉధృతంగా ప్రవహించడంతో పలుచోట్ల భారీగా ఇసుక మేటలు వేసింది. ప్రస్తుతం నదుల్లో వరద ప్రవాహం లేకపోవడంతో ఇసుక తవ్వకాలు, తరలింపునకు పరిస్థితులు అనుకూలంగా వున్నాయి. ఇదిలావుండగా ఇళ్ల నిర్మాణాల కోసం సచివాలయాల్లో అనుమతులు తీసుకుని, స్థానికంగా వున్న నదులు, గెడ్డల్లో ఇసుక తవ్వి తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ఇటీవల వెసులుబాటు కల్పించింది. దీంతో వరహా నదిలో ... మిగతా 6వ పేజీలో

గబ్బాడలో ఇసుక సరఫరా బంద్

ఐదు రోజులుగా నిలిచిపోయిన ఆన్‌లైన్ బుకింగ్

- ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని.. డిపోలో డబ్బులు కట్టి ఇసుక తీసుకోవాలని పోర్టల్ సమాచారం
- డిపోకి వెళితే... పోర్టల్‌లో మార్పులు చేస్తున్నారని సిబ్బంది సమాధానం
- ఇసుక కొరతతో ఇళ్లనిర్మాణదారుల అవస్థలు



ఇసుక సరఫరా నిలిచి పోయిన గబ్బాడ డిపో

నర్సీపట్నం, నవంబరు 1: నర్సీపట్నం మండలం గబ్బాడ డిపోలో ఇసుక సరఫరా నిలిచి పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ఇసుక బుకింగ్‌ను పూర్తిగా ఆపేసింది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ మాత్రమే అవుతున్నది. రిజిస్ట్రేషన్ చేయించుకొని ఇసుక డిపోకి వెళ్లి అక్కడ ఇన్‌చార్జిని కలవాలని ఆన్‌లైన్‌లో చూపిస్తున్నది. ఇసుక డిపో వద్దకు వెళితే ప్రభుత్వం ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టంలో కొన్ని మార్పులు చేస్తున్నదని, అందువల్ల సరఫరా ఆపేశామని సిబ్బంది చెబుతున్నారు. వాస్తవంగా గత శనివారం నుంచే ఇసుక సరఫరా సమస్య తీవ్రంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో రాజమహేంద్రవరం నుంచి ఇసుకను భారీ మొత్తంలో తీసుకువచ్చి గబ్బాడ డిపోలో నిల్వచేశారు. అయితే ఇసుక తవ్వకాల విషయంలో పర్యావరణ నిబంధనలను అతిక్రమించారని కొంతమంది ఎన్‌జీటీని ఆశ్రయించారు. దీంతో గబ్బాడలో ఇసుక అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు వచ్చాయి. తరువాత అధికారులు ఇసుక నిల్వలను కొలతలు వేయడం, స్పీకర్ అయ్యన్నపాత్రుడు జోక్యం చేసుకొని ఇసుక అమ్మకాలు ప్రారంభించాలని ఆదేశించడంతో గత నెల 19వ తేదీన గబ్బాడలో టీడీపీ నాయకులు, మైనింగ్ ఏడీ ఇసుక అమ్మకాలను ప్రారంభించారు. 21 నుంచి ఇసుక సరఫరా మొదలు పెట్టారు. అయితే 26 నుంచి ఆన్‌లైన్ బుకింగ్ ఆపేయడంతో ఇసుక సరఫరా నిలిచిపోయింది.

రెచ్చిపోతున్న అక్రమార్కులు

గబ్బాడ డిపో నుంచి ఇసుక సరఫరా నిలిచిపోవడంతో భవన నిర్మాణదారులు స్థానికంగా లభించే ఇసుక మీద ఆధార పడాల్సి వస్తున్నది. నదుల్లో ఇసుక తవ్వకొని ట్రాక్టర్లతో తరలించుకోవచ్చని ప్రభుత్వం కల్పించిన వెసులుబాటుతో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. అక్రమార్కులు నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలో బలిఘట్టం వరహా నది, నాతవరంలో చిక్కుడుపాలెం, చమ్మచింత. గుమ్మిడిగొండ, మాకవరపాలెం మండలంలో సర్పా నదిని ఆనుకొని ఉన్న జంగాపల్లిలో, కోటవురట్ల మండలం ఇందేశమ్మ ఘాట్ రోడ్డులోని వరహానదిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.6,500 విక్రయిస్తున్నారు. ఆయా మండలాలలో అధికార, ప్రతిపక్ష నాయకులు ఏకమై ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అచ్యుతాపురంలో ఇసుక దందా

శ్రీకాకుళం జిల్లా నుంచి దొడ్డిదారిన రప్పిస్తున్న దళారులు

టన్ను ఇసుక రూ.1,200లకు బహిరంగంగానే విక్రయం

పట్టించుకోని, రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు

అచ్యుతాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):



వెదురువాడ వద్ద ఇసుక టిప్పర్లు

అచ్యుతాపురంలో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నది. కొంతమంది స్థానికులు దళారుల అవతారం ఎత్తి శ్రీకాకుళం జిల్లాలో నాగావళి, వంశధార నదుల నుంచి భారీ మొత్తంలో ఇసుకను రప్పిస్తున్నారు. స్టాక్ యార్డులు ఏర్పాటు చేసుకుని టన్నుల చొప్పున విక్రయిస్తున్నారు. స్థానికంగా ఎక్కడ ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇళ్ల పనుల కోసం దళారులను ఆశ్రయించాల్సి వస్తున్నదని భవన నిర్మాణదారులు చెబుతున్నారు.

ప్రత్యేక ఆర్థిక మండలిలతోపాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో భవన నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వైసీపీ హయాంలో కొద్ది రోజులపాటు ఇక్కడ ప్రభుత్వ ఇసుక డిపోను నిర్వహించారు. ఇసుక తవ్వకాలు, రవాణా, విక్రయాలను ప్రైవేటు పరం చేసిన తరువాత ఇక్కడ ఇసుక డిపోను ఎత్తివేశారు. అప్పటి నుంచి దళారులు ఇసుక వ్యాపారం చేస్తున్నారు. అక్రమ మార్గాల్లో ఇసుకను తీసుకువచ్చి, ఎక్కువ ధరకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకోవడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో నాలుగున్నర నెలల క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వం.. ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రకటించి రెండు నెలల క్రితం ఇసుక పాలసీని ప్రకటించింది. కానీ అచ్యుతాపురం మండలంలోనే కాదు.. జిల్లాలో ఎక్కడా ఇసుక ర్యాంపులు లేకపోవడంతో స్థానికులు ఇసుక కోసం దళారులపైనే ఆధారాపడాల్సి వచ్చింది. వైసీపీ హయాంలో ఇసుక అక్రమ అమ్మకాలు జరిపిన వ్యక్తులే మళ్లీ ఇప్పుడు ఇసుక వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల వరకు ... మిగతా 6వ పేజీలో

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 93.2 శాతం మందికి పంపిణీ



పరవాడలో మహిళకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

అనకాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ తొలిరోజైన శుక్రవారం 93.2 శాతం మందికి అందజేశారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది ఉదయం ఆరు గంటల నుంచే లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు. డీఆర్‌డీఏ అధికారి శశీదేవి అందించిన వివరాల ప్రకారం.. జిల్లాలో 2,59,778 మందికిగాను శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయానికి 2,42,487 మందికి పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. మిగిలిన వారికి శనివారం అందజేస్తామని ఆమె తెలిపారు.

రైల్వే పార్శిల్ క్లోజ్!

అనకాపల్లిలో సరకు రవాణా బుకింగ్ విభాగం మూసివేత!

- ప్రైవేటు వ్యక్తులకు సరకు రవాణా బాధ్యతలు
- జీవనోపాధి కోల్పోయిన హమాలీలు
- పార్శిల్ బుకింగ్‌ను కొనసాగించాలని వ్యాపారులు వినతి



అనకాపల్లిలో రైల్వే స్టేషన్‌లో మూత పడిన పార్శిల్ విభాగం

అనకాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం నుంచి సరకు రవాణా (గూడ్స్) విభాగం మూత పడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి పార్శిల్ బుకింగ్‌లు నిలిపేశారు. దేశ వ్యాప్తంగా ప్రధాన రైల్వే టెర్మినళ్ల వద్ద గూడ్స్ షెడ్లను ఎంపిక చేసి అక్కడ నుంచి 'సర్వీస్ మార్కెట్ ఎట్ రైల్వే టెర్మినల్స్ (స్మార్ట్)' అనే పథకాన్ని రైల్వే శాఖ ప్రారంభించనుంది. సరకు రవాణా బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ద్వారా ఇకముందు రైల్వే స్టేషన్‌లకు వచ్చే సరకును నేరుగా వినియోగదారునికి అందించేందుకు సర్వీసు ప్రొవైడర్లకు అవకాశం కల్పించనుంది. ఇందులో భాగం గా వాల్తేరు డివిజన్‌లోని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో 'స్మార్ట్' సేవలను అందుబాటులోకి తేనున్నారు. ఈ కారణంతోనే అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ఎన్నో ఏళ్లుగా వున్న గూడ్స్ బుకింగ్ కౌంటర్‌తోపాటు రవాణా సేవలను నిలిపేస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు రైల్వే శాఖ ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని స్థానిక రైల్వే అధికారులు ... మిగతా 6వ పేజీలో

ఎలా బతకాలో తెలియడంలేదు



అనకాపల్లి రైల్వే స్టేషన్ సరకు రవాణా బుకింగ్ కేంద్రంలో నేను 13 ఏళ్ల నుంచి హమాలీగా పనిచేస్తున్నాను. మా తాత, నాన్న కూడా ఇక్కడే పనిచేశారు. రోజూ రూ.500 వరకు కూలి వస్తుంది. దీంతోనే కుటుంబాన్ని పోషించు కుంటున్నాను. ఉన్నపళంగా సరకు రవాణా బుకింగ్ కార్యాలయాన్ని ఎత్తివేస్తే ఎలా బతకాలో అర్థం కావడం లేదు. పార్శిల్ బుకింగ్ ఆఫీస్‌ను యథావిధిగా కొనసాగించాలి.

- అప్పలస్వామి, హమాలీ, రైల్వే పార్శిల్ బుకింగ్

వాడవాడలా దీపావళి వేడుకలు



పిల్లలతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకుంటున్న మంత్రి అనిత

నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లల నుంచి పెద్దల వరకూ ఎంతో ఉత్సాహంగా దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ఇంటింటా హిందువులు లక్ష్మీదేవి అమ్మవారిని పూజించి, నైవేద్యాలు సమర్పించారు. బాణసంచా పేలుళ్లతో వీధులు వెలుగులు విరజిమ్మాయి. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తన నివాసంలో పిల్లలతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నారు.

ఉపమాక వెంకన్నను దర్శించుకున్న హోం మంత్రి

నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వర స్వామిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆమెకు టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారిని, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో నెలకొన్న పలు సమస్యలు, పునర్నిర్మాణం తదితర అంశాల గురించి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆమెకు వివరించారు. ఆలయానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల గురించి ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు తెలియజేశారు. ఉపమాక దేవస్థానం అభివృద్ధి పనులపై ఈ నెల 6వ తేదీ టీటీడీ ఉన్నతాధికారులతో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆమె వెంట టీడీపీ నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి శ్రీను, తోలేటి శ్రీను తదితరులు వున్నారు.

శివ పూజకు శైవ క్షేత్రాల ముస్తాబు



కార్తీకమాసం పూజలకు ముస్తాబైన ఉపమాకలో పురాతన శివాలయం

నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివ పూజకు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. శనివారం ఉదయం నుంచి కార్తీకమాసం ప్రారంభం కానుంది. నెల రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో పిల్లల నుంచి పెద్దల వరకు శివపార్వతులను పూజిస్తారు. నక్కపల్లి మండలంలో అతి పురాతనమైన శివాలయం ఉపమాకలో ఉంది. పలు గ్రామాల నుంచి భక్తులు ప్రతి రోజూ శివాలయానికి వస్తారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ బుజ్జి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శివాయలంలో కొన్ని పనులు చేపట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆలయానికి పెయింటింగ్ వేయించారు. కార్తీకమాసం సోమవారాల్లో అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. మండలంలోని గొడిచెర్ల శేష లింగేశ్వరస్వామి ఆలయాన్ని కూడా కార్తీక మాసం పూజలకు భక్తులు ముస్తాబు చేశారు.

ఏది నిజం..?



'ఏపీ బాలయోగి గురుకులం గర్ల్స్' పేరుతో కనిపిస్తున్న ప్రవేశ ద్వారం బోర్డుపై

గురుకుల విద్యాలయానికి రెండు పేర్లు!

ప్రవేశ ద్వారం బోర్డులో 'బాలయోగి గురుకులం'

లోపల భవనానికి 'బీఆర్ అంబేడ్కర్ గురుకులం'

ఏది వాస్తవమోనని తల్లిదండ్రుల తికమక!

నక్కపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నక్కపల్లిలో నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు (గురుకులానికి) ఎంతో పేరుంది. నక్కపల్లి హైస్కూల్‌కు ఎదురుగా హైవేకు ఆనుకుని వున్న ఈ గురకుల విద్యాలయం అసలు పేరేమిటోనని విద్యార్థులు, తల్లిదండ్రులు తికమకపడుతున్నారు. గురుకుల విద్యాలయం బోర్డులు రెండు పేర్లతో వేర్వేరుగా కనిపించడమే ఇందుకు కారణం. గురుకులం బయట ప్రవేశద్వారం వద్ద 'బాలయోగి గురుకులం' పేరుతో బోర్డు కనబడుతోంది. లోపల గురుకులం భవనంపై మాత్రం 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం' పేరు కనిపిస్తుండడం విశేషం.



'డాక్టర్ అంబేడ్కర్ గురుకులం' పేరుతో ఉన్న భవనం

వాస్తవానికి సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో వుండే ఈ గురుకులం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతోనే కొనసాగుతున్నా, హైవేకు ఆనుకుని వున్న ప్రవేశద్వారంపై వున్న బాలయోగి గురుకులం వుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు గందరగోళానికి గురవుతున్నారు. ఈ రెండు పేర్లలో ఏది కరెక్టోనని తికమక పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, ఉద్యోగులు ఓ స్పష్టతకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై శుక్రవారం సాయంత్రం గురుకులం సిబ్బందిని సంప్రదించగా, తమది డాక్టర్ అంబేడ్కర్ గురుకులమేనని తెలిపారు.

జాతీయ స్థాయి చదరంగం పోటీలకు శ్రావ్యశ్రీ ఎంపిక



శ్రావశ్రీ

ఎస్.రాయవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని భీమరశెట్టి శ్రావ్యశ్రీ జాతీయ స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైంది. అక్టోబరు 29, 30 తేదీల్లో సత్యసాయి జిల్లా, లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయం వద్ద అండర్-14 విభాగంలో శ్రావ్యశ్రీ గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు బాలిక తండ్రి యుగేందర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖ ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొన్న బాలికలు మొదటి స్థానంలో నిలవగా ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహించిన విద్యార్థిని శ్రావ్యశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని యుగేందర్ చెప్పారు. శ్రావ్యశ్రీని బోధకులు, గ్రామస్థులు అభినందించారు.

సర్పంచుల ప్రమేయం లేకుండా ఉపాధి పనులు

▸▸ ఎంపీడీవోకు మాజీ ఎమ్మెల్సీ, సర్పంచుల ఫిర్యాదు

కోటవురట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్పంచుల ప్రమేయంగా లేకుండా ఉపాధి హామీ పథకం పనులు చేపడుతుండడంపై పలువురు సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీ డీవీసూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కాశీవిశ్వనాథంకు ఫిర్యాదు చేశారు. ఉపాధి పథకం నుంచి కొన్ని పనులను గ్రామసభల ద్వారా తీర్మానం చేయాల్సి ఉండగా, కొన్ని గ్రామాలకు మెటీరియల్ కంపోజిట్‌లో పనులు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారని, ఈ పనులకు ఎన్ఆర్‌జీఎస్ నుంచి 75 శాతం నిధులు మంజూరు చేయగా మిగతా 25 శాతం నిధులు గ్రామపంచాయతీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. అయితే అంత సొమ్ము తమవద్ద లేవని సర్పంచులు స్పష్టం చేశారు. కనీస అవసరాలు వినియోగించడానికి మాత్రమే పంచాయతీ వద్ద నిధులు ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీ సభ్యులు 25 శాతం నిధులు కేటాయించడానికి ఆమెదించడం లేదని వారు స్పష్టం చేశారు. వెండర్ నామినేట్ చేసే అధికారం కూడా గ్రామ సర్పంచులకు మాత్రమే ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ శాఖల అధికారులు ఇష్టం వచ్చిన వారితో పనులు చేయిస్తే గ్రామపంచాయతీ తీర్మానం ఇవ్వడం జరగదన్నారు. ఉపాధి పనులు సర్పంచ్ ఆమోదంతోనే జరగాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ, సర్పంచులు

ఆర్‌బీఐ-90 క్విజ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థినుల ప్రతిభ

పాయకరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఇటీవల జరిగిన ఆర్‌బీఐ-90 రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ అను బంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రూ.1.5 లక్షల నగదు బహుమతి అందుకున్నారు. గత నెల 28న విజయవాడ నోవాటెల్‌లో జరిగిన ఆర్‌బీఐ-90 రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల ఫైనల్ రౌండ్‌లో ఆరు టీమ్‌లు పాల్గొనగా, తమ కళాశాల విద్యార్థినులు ఎన్.దేవి, జి.సత్యవిజయ టీమ్ ద్వితీయ స్థానం సాధించారని శుక్రవారం విద్యా సంస్థల యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వీకే.నరసింహారావు విద్యార్థినులను అభినందించడంతో పాటు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్‌తోపాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినిలకు నగదు బహుమతి అందజేస్తున్న సీహెచ్‌వీకే.నరసింహారావు

ఘనంగా పెదిరెడ్డి చిట్టిబాబు జన్మదిన వేడుకలు

పాయకరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు, తుని నియోజకవర్గ పరిశీలకుడు పెదిరెడ్డి చిట్టిబాబు పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక సాయి వేదిక ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బర్త్ డే కేక్‌చేసి పెదిరెడ్డి చిట్టిబాబుకి తినిపించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్దం, జానకి శ్రీను, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు దేవవరపు రాజబాబు, బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, వంకా వెంకటరమణ, కంకిపాటి వెంకటేశ్వరరావు, చిక్కాల శ్రీను, చించలపు పద్దు, పల్లా విలియంకేరి, సూరా సుబ్రహ్మణ్యం పెదిరెడ్డి చిట్టిబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మలిపెద్ది వెంకటరమణ, బత్తిన అచ్చిరాజు, గారా కృష్ణప్రసాద్, జూరెడ్డి ప్రసాద్, ఎం.రమాకుమారి, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, కురందాజు శివ, గొర్ల లక్ష్మినారాయణ, జి.భాస్కర చౌదరి, ఎస్పీ.గిరిధర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది.



చిట్టిబాబుకే కేక్ తినిపిస్తున్న హోం మంత్రి అనిత

పొగాకు వినియోగం ఎంతో ప్రమాదం

ఎస్.రాయవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వినియోగం ఎంతో ప్రమాదకరమని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ హెచ్చరించారు. మండలంలోని సర్వసిద్ధిలో శక్తిప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం లంగ్, స్టమక్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొగాకు వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. దీనివలల నోటి, లంగ్ క్యాన్సర్ రాకుండా అడ్డుకట్ట వేయగలమన్నారు. పొగ తాగడం, గుట్కా, పాన్ మసాలా నమలడం, మద్యం సేవించడం వల్ల కలిగే నష్టాల గురించి శక్తిప్రియ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబ్బంది పీఎస్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్రిమూర్తులతో రాష్ట్రం అభివృద్ధి



ఎలమంచిలిలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లను అందిస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

▸▸ దీపం పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే 'సుందరపు'

ఎలమంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ.., ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.., డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఈ త్రిమూర్తుల ఆధ్వర్యంలోనే ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని విమర్శించారు. ప్రజలంతా కష్టాలు ఎదుర్కొన్నారని వాపోయారు. మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల కలయికతో మళ్లీ రాష్ట్ర ప్రగతి పథాన పయనిస్తుందన్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసి చూపుతోందన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యంగా పేర్కొన్నారు. ఎలమంచిలి పట్టణంలోకి ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు వచ్చేలా చేశామని, వాల్వా వంటి బస్సులు వచ్చేందుకు బస్టాండ్ వద్ద ఆటంకంగా ఉన్న దిమ్మను తొలగించి తీరుతామని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకారం అందించాల్సిందిగా ఆయన కోరారు. అనంతరం పలువురు మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశారు. తహసీల్దార్ వరహాలు, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కాంద్రకోట చిరంజీవి, లవుడు లోవరాజు, కొఠారు సాంబ, ఆడారి రమణబాబు, అన్నం బాబ్జీ, కె.యూనస్, ఎస్.చిట్టిబాబు, గుర్రాల శేఖర్, కరణం రవి, బుల్లిబాబు, కొలగాని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లిలో శుక్రవారం ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే విజయకుమార్ అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధురి, వైస్ ఎంపీపీ లక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, కూటమి నాయకులు దిన్‌బాబు, పప్పల నూకన్నదొరలు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పాంచరాత్రి ఉత్సవాలు

▸▸ భూలోకమాంబ, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాల్లో సాంప్రదాయ బద్ధంగా ప్రారంభం

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు పూజలు

▸▸ ఎలమంచిలి పట్టణంలో ఎటుచూసినా కోలాహలం



సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటున్న విజయకుమార్, చలపతిరావు, ఆనంద్, రమాకుమారి

ఎలమంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాంచరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తులసీనగర్‌లోని భూలోకమాంబ, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, విశాఖ డెయిరీ చైర్మన్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, ఆలయ ధర్మకర్త పిళ్లా రమాకుమారి సాంప్రదాయ రీతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. వీరికి నిర్వాహకులు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటైన విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రెండు ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఆడారి శ్రీధర్, మళ్ల కొండబాబు, కర్రి జానకీరామ్, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, ఆడారి రమణబాబు, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, గుర్రాల శేఖర్, కొఠారు శ్రీను, కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి రోజు ప్రారంభమైన ఈ వేడుక నాగుల చవితి వరకూ కొనసాగుతుంది. ఆ రోజు రాత్రి జరిగే తీర్థానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలి వస్తుంటారు. ఇందుకు అనుగుణంగానే ఉత్సవ కమిటీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, ఆలయ ధర్మకర్త, మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిల ఆధ్వర్యంలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. అలాగే, ప్రజాప్రతినిధులతో పాటు పలువురు ప్రముఖులు కూడా హాజరు కానున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

గుండెపోటుతో ఆర్మీ ఉద్యోగి మృతి



శివశంకర్రావు (ఫైల్)

రాంబిల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలి గ్రామానికి చెందిన గంగిరెడ్ల శివశంకర్రావు (39) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందినట్టు తమకు సమాచారం అందిందని అతని కుటుంబ సభ్యులు తెలిపారు. శివశంకర్రావు శ్రీనగర్‌లో విధి నిర్వహణలో ఉండగా మృతిచెందారని చెప్పారు. మరో ఏడాదిన్నరలో పదవీ విరమణ పొందే సమయంలో ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని శ్రీనగర్ నుంచి స్వగ్రామానికి తీసుకువస్తారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దీపావళి పండుగ



పూడిమడక జగన్నాథస్వామి ఆలయంలో దీపారాధన

ఎలమంచిలి/అచ్యుతాపురం/రాంబిల్లి/మునగపాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను ప్రజలు గురువారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. వేకువనే లేచి స్నానాల అనంతరం ఆలయాలకు వెళ్లి ఇష్ట దైవాలను పూజించారు. సాయంత్రం ఇంటిని దీపాలతో అలంకరించి లక్ష్మీదేవికి పూజలు నిర్వహించడంతో పాటు పితృదేవతలను స్మరించుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చడం ఆరంభించారు. అచ్యుతాపురం మండలం పూడిమడక జగన్నాథస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు దీపారాధన చేసి స్వామికి విశేష పూజలు జరిపారు.

రాంబిల్లి ప్రధాన రోడ్డుపై ఆందోళన

రాంబిల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం రాంబిల్లి ప్రధాన రోడ్డుపై సుమారు గంట పాటు సీఐటీయూ, వివిధ ప్రజా సంఘాల నేతలు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో సుమార గంటపాటు వాహనాలకు అంతరాయం ఏర్పడింది. నేవీ నిర్మాణ పనుల కారణంగా భారీ భారీ వాహనాలు తిరుగుతుండడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ఆయా సంఘాల నేతలు దేముడు నాయుడు, బి.అప్పారావు, గంగరాజు, చందక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ప్రగడ

ఎలమంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందుంటుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మునిసిపాలిటీలోని పదకొండో వార్డు యర్రవరంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నదే తమ లక్ష్యంగా పేర్కొన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జోరుగా సాగుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో రెండో స్థానంలో ఉన్నామన్నారు. గతంలో నమోదు శాతాన్ని అధిగమించేందుకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఆడారి రమణబాబు, నాయకులు కొఠారు సాంబ, రాజాన సూర్యనాగేశ్వరరావు, ఆడారి ఆదిమూర్తి, కరణం రవి, ముప్పిన కృపారావు, గులివెందుల తిరుమలరావు, నానేపల్లి సుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొ

అచ్యుతాపురం : కూటమి ప్రభుత్వం మాట తప్పదని ఎలమంచిలి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మడుతూరులో శుక్రవారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దిబ్బపాలెం ఎంపీటీసీ సభ్యుడు నీరుకొండ నర్సింగరావు, శనివాడ ఆనందరావు, సుంకర శ్రీనివాసరావు, సాయిన అప్పారావు, దేశంశెట్టి సన్యాసినాయుడు, బాబూరావు, గోవింద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



యర్రవరంలో దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న నాగేశ్వరరావు

సబ్‌జైళ్లను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

▸▸ రిమాండ్ నిందితులకు అందుతున్న సేవలపై ఆరా

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ శుక్రవారం స్థానిక సబ్‌జైలును పరిశీలించారు. పలువురు నిందితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఏయే నేరాల్లో అరెస్టయ్యారో తెలుసుకుని, భవిష్యత్తుకు సంబంధించి పలు సూచనలు చేశారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటుపై జైలు అధికారులను ప్రశ్నించారు. న్యాయపరంగా సహాయం చేయాలని నిందితులు కోరితే వెంటనే సంబంధిత న్యాయ అధికారులకు నివేదించాలని ఆమె సూచించారు. బాల నేరస్థులను జువెనైల్ హోమ్‌కు పంపాలన్నారు. జైలు పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయ సహాయకులు సాయిరామ్, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ, జైలు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో...

ఎలమంచిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సబ్ జైలును శుక్రవారం అనకాపల్లి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ సందర్శించారు. జైలు రికార్డులను, రిమాండ్‌లో ఉన్న నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలు నిబంధనల మేరకు నిందితులకు సేవలు అందిస్తున్నట్టు సబ్ జైలు అధికారి ప్రసాద్ వివరించారు. కొత్త చట్టాల గురించి జైలు అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ప్యానెల్ న్యాయవాదులు పీవీ రమణ, దుర్గాప్రసాద్, బి.హరిశంకరరావు పాల్గొన్నారు.



అనకాపల్లి సబ్‌జైలు అధికారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

అతిథి గృహంలో ఎంపీడీవో నిద్ర!

▸▸ సోషల్ మీడియాలో వైరల్ ▸▸ పనులపై వచ్చిన వారు నిరాశతో తిరుగుముఖం

అచ్యుతాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎంపీడీవో కె.ప్రభాకరరావు విధుల సమయంలో జడ్పీ అతిథి గృహంలో నిద్రపోయారంటూ శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై వివరణ కోరిన విలేకరులకు సైతం 'పడుకుంటే తప్పేంటి..?' అని ఆయన ఎదురు ప్రశ్నవేశారు. ప్రతి శుక్రవారం మండల కాంప్లెక్స్‌ను ఆనుకొని వారపు సంత జరుగుతుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులతో పాటు ప్రజలు ఎక్కువగా సంతకు వస్తారు. అచ్యుతాపురంలో తహసీల్దార్, పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీ, ఎంఈవో, ఎంపీడీవో, గ్రంథాలయం, హౌసింగ్, స్త్రీశక్తి భవనాలన్నీ ఒకే చోట ఉంటాయి. సంతకు వచ్చిన ప్రజలు కావలసిన వస్తువుల కొనుగోలుతో పాటు కార్యాలయాల్లో పనులను కూడా చూసుకొని సాయంత్రానికి ఇంటికి వెళతారు. అయితే మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఎంపీడీవో కార్యాలయానికి వివిధ పనులపై వెళ్లిన వారికి ఎంపీడీవో లేరన్న సమాధానం ఎదురైందని తెలిసింది. దీంతో ఎంపీడీవో ఎక్కడికి వెళ్లారని ఆరా తీయగా.. ఆ కార్యాలయం పక్కనే గల జడ్పీ గెస్ట్ హౌస్‌లో పడుకున్నారని తెలిసింది. విలేకర్లు ఫోటోలు తీసి వివరణ కోరగా, తనకు ప్రతి రోజూ భోజనం చేసిన తర్వాత ఒక గంట పడుకొనే అలవాటుందని ఆయన వివరించారు. అసలు పడుకుంటే తప్పేంటి అని ఆయన ప్రశ్నించడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



జడ్పీ అతిథి గృహంలో నిద్రపోతున్న ప్రభాకరరావు

హామీల అమలే కూటమి లక్ష్యం

- ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ మాటకు కట్టుబడే నేతలు
- కొత్త సంవత్సరం కానుకగా అర్హులైన వారికి రేషన్ కార్డులు
- దీపం-2 పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల



లబ్ధిదారుకు ఉచిత గ్యాస్ సిలెండర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, పీలా, ఆర్డీవో ఆయాషా



గాంధీనగరంలో వృద్ధురాలి ఇంట్లో టీ తయారు చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ భవనంలో శుక్రవారం సాయంత్రం దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మాట్లాడారు. ఎన్నికల ముందు రూ.మూడు వేలు ఉన్న పింఛన్‌ను రూ.నాలుగు వేలుగా ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశామన్నారు. అలాగే ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామన్న మాటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారన్నారు. కొత్త సంవత్సరం కానుకగా అర్హులైన వారికి రేషన్‌కార్డులు కూడా అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం అధికారులను వాడుకుందన్నారు. అధికారులను ఏ విధంగా వినియోగించుకోవాలో చంద్రబాబుకు తెలుసునన్నారు. అప్పట్లో జీతాలు ఇవ్వడానికి కూడా అధికారులకు వైసీపీ ప్రభుత్వం చుక్కలు చూపించిందని, కూటమి ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందిస్తున్నట్టు చెప్పారు. భూముల రీసర్వేను ఇష్టానుసారంగా చేశారని, ఇప్పుడు వాటిని సరి చేస్తున్నామని వివరించారు. అనకాపల్లి నియోజకవర్గంలో రూ.20కోట్లతో రహదారుల నిర్మాణం చేపడతామన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని త్వరలో అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1997లోనే దీపం పథకం ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వానికి ఈ పథకం గుర్తుకు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులకే ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అమలు చేస్తున్నారన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయాషా, డీఎస్‌వో కేవీఎల్ఎన్ మూర్తి, ఐఓసీ సేల్స్ మేనేజర్ బి.గోపాల్, తహసీల్దార్లతో పాటు వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఇంట్లో టీ తయారు చేసిన కలెక్టర్

ఇదిలావుంటే, దీపం పథకం ప్రారంభోత్సవంలో భాగంగా గాంధీనగరంలో గల మావూరు రమణమ్మ అనే వృద్ధురాలి ఇంటిని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా సందర్శించారు. ఈ సందర్భంగా ఆ ఇంట్లో గ్యాస్ స్టౌపై కలెక్టర్ టీ తయారు చేశారు. అనంతరం ఆ టీని అధికారులు, ప్రజాప్రతినిధులు తాగారు. అధికారులు, ప్రజాప్రతినిధులంతా తన ఇంటికి రావడంపై రమణమ్మ ఆనందం వ్యక్తం చేసింది.

యువతకు ఉపాధి కల్పన

- పెందుర్తి ఎమ్మెల్యే 'పంచకర్ల'

పరవాడ : దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం పరవాడ సంతబయలు వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇప్పటికే రెండు హామీలను నెరవేర్చడం జరిగిందన్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఐదేళ్లలో సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి, తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్, ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, అన్నిశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి గ్యాస్ సిలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల



గవరపాలెంలోని భోగలింగేశ్వరుని ఆలయం

శివ పూజకు వేళాయె..

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- ముస్తాబైన శైవక్షేత్రాలు



అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం ఆరంభమైంది. శనివారం ఉదయం నుంచి పరమ శివునికి పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా పల్లెలు, పట్టణాల్లో గల శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. అనకాపల్లి పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, భోగలింగేశ్వర, ఉమారామలింగేశ్వర తదితర ఆలయాల్లో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ప్రతి సోమవారం విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల రోజులూ భక్తులు వేకువనే నిద్ర లేచి స్నానాలను ఆచరించి నీలకంఠుడ్ని దర్శించుకోనున్నారు.

కొలువుదీరిన గవరపాలెం గౌరీ పరమేశ్వరులు



అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం సతకంపట్టులో గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ముందుగా బుధవారం రాత్రి మెయిన్ రోడ్డులోని మనోహర ఆర్కేడ్ వద్ద రమేష్ ఆర్ట్స్ బృందం తయారు చేసిన గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఆధ్వర్యంలో పుర వీధుల గుండా మేళతాళాలతో భారీ ఊరేగింపుగా తీసుకు వచ్చి, గురువారం తెల్లవారుజామున సతకంపట్టు ఆలయంలో ప్రతిష్ఠించారు. దారిపొడవునా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మినాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పీవీ రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, మద్దాల శంకరరావు, పెంటకోట జగది, కాండ్రేగుల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రామకోటి క్రతు స్తంభాన్ని పెద్ద జీయర్‌స్వామి ప్రతిష్ఠించి 55 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవంలో భాగంగా ఈ వేడుకను జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, వుప్పల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'కూరగాయల మార్కెట్ అభివృద్ధికి చర్యలు'

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గాంధీ మార్కెట్‌లో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్ఐడీసీ) ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. మార్కెట్‌లో మహిళలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల కోసం సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కొణతాల సూచనప్రాయంగా తెలిపారు. అలాగే మార్కెట్ అభివృద్ధికి సంబంధించి దుకాణదారులతో మాట్లాడారు. వీరి వెంట టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

రహదారికి టీడీపీ శ్రేణులు మరమ్మతులు

పరవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లలపాలెం నుంచి వెన్నెలపాలెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గొల్లలపాలెం జంక్షన్ వద్ద ధ్వంసమైంది. ఇంటింటికి కుళాయి పైపులైన్ కోసం మూడేళ్ల క్రితం రోడ్డును తవ్వి పైపు లైన్లు ఏర్పాటు చేశారు. అయితే గోతులను పూడ్చకపోవడంతో అవి మరింత పెద్దగా తయారై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో టీడీపీ నాయకులు (బండారు యువసేన) స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను సిమెంట్, నల్లపిక్కలు కలిపి గురువారం పూడ్చివేయించారు. దీంతో అటుగా రాకపోకలు సాగించేవారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు వీరునాయుడు, లోకిరెడ్డి అబి సన్యాసినాయుడు, బొజంకి అప్పలనాయుడు, పైలా ప్రసాద్, బండారు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'భూ సమస్యపై ఫిర్యాదు చేస్తే పరిష్కారం'



అయ్యన్నపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామ సభల్లో వస్తున్న ప్రతి అర్జీకి పరిష్కారం చూపిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ స్పష్టం చేశారు. మండలంలోని అయ్యన్నపాలెంలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడారు. భూ సమస్యలకు సంబంధించి గ్రామ సభల తరువాత అర్జీలు ఇచ్చినా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి భూముల అవసరం ఎంతో ఉన్నందున ప్రభుత్వ భూముల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఆక్రమణలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా 141మంది ఈ సభలో అర్జీలు సమర్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వై.గణేష్, సర్పంచ్ బుదిరెడ్ల శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్డ కనకరాజు, సర్వేయర్లు ఎల్.అప్పారావు, శ్యామ్, రాంబాబు, వీఆర్వో ఎంగోవిందరావు, గ్రామ పెద్దలు తుంపాల నానాజీ, బుదిరెడ్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

తుమ్మపాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనియన్ సీనియర్ నేత కొండూరి వీరాచారి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ 105 సంవత్సరాలుగా కార్మిక వర్గం పక్షంగా రాజీలేని పోరాటాన్ని సాగిస్తున్న కార్మిక సంఘం ఏఐటీయూసీగా పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్ర, ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మికుల హక్కుల కోసం మెరుగైన చట్టాలు ప్రభుత్వాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.ఎస్.సన్యాసిరావు, వైఎన్ భద్రం, కె.త్రినాథ్, వియ్యపు రాజు, కోరిబిల్లి శంకరరావు, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి'

- పార్టీ శ్రేణులకు గండి బాబ్జీ పిలుపు



పరవాడలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గండి బాబ్జీ

పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జి

పరవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పిలుపునిచ్చారు. పరవాడలో శుక్రవారం సాయంత్రం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పెన్నిధి ఎన్టీరామారావు స్థాపించిన టీడీపీలో సభ్యత్వం పొందడం ఎంతో గర్వంగా ఉందన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమాతో పాటు అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు చింతకాయల ముత్యాలు, కన్నూరు వెంకటరమణ, పైలా రామచంద్రరావు, బొండా సన్నిదేముడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, గండి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి



అనకాపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి శుక్రవారం పలువురు నివాళులర్పించారు. రాష్ట్ర సాధనలో ఆయన సాగించిన పోరాటాన్ని కీర్తించారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా 'ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు పాత్ర' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నీలేష్‌గుప్తా, కృష్ణమోహన్, ఆర్.మల్లేశ్వరరావు, బి.సోమరాజుతో పాటు పిరాట్ల నరసింహమూర్తి, వేగి త్రినాథ్, న్యాయవాది గోకుల వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో ..

కశింకోట : విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత సంఘం అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి కానూరు గోపాలరావు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రారంభమైన వైద్య శిబిరంలో వందమందికి డాక్టర్ పల్లవి చైతన్య బృందం వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎ.కామేశ్వరరావు, నంబా రమణ తదితరులు పాల్గొన్నారు.

నరకాసుర దిష్టిబొమ్మ దహనం



దహనమవుతున్న నరకాసురుడు

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా స్థానిక గవరపాలెంలో పీలా వారి గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద గురువారం రాత్రి నరకాసుర వధ కార్యక్రమాన్ని భక్తుల కేరింతల మధ్య ఘనంగా నిర్వహించారు. పలు రకాల మందుగుండు సామగ్రిని నింపి, సుమారు 15 అడుగుల ఎత్తున తయారుచేసిన నరకాసురుడి దిష్టిబొమ్మకు ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్ నిప్పంటించారు.ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహానూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాగదుర్గమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

కొత్తూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో వెలసిన నాగదుర్గమ్మ అమ్మవారి జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం జనసేన కార్యాలయంలో ఆవిష్కరించారు. ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు జాతరలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పెద్దసంఖ్యలో భక్తులు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాగదుర్గమ్మ జాతర మహోత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామానా పింఛన్ల పంపిణీ

- ఎమ్మెల్యేలు కొణతాల, పంచకర్ల తదితరులు హాజరు

కొత్తూరు/కశింకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ కొత్తూరు రామాపురం కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పండుగలా జరిగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ హాజరై ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆయిషా, సర్పంచ్ ప్రసన్నలక్ష్మి, కూటమి నేతలు భరత్‌బాబు, చదరం నాగేశ్వరరావు, పచ్చికూర రాము, కోన శ్రీనివాసరావు, మేడిశెట్టి సత్తిబాబు, నూకరాజు, గణేష్, మళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే, కశింకోట మండలంలోని తేగాడ, కొత్తపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీని చేపట్టారు. ఎంపీడీవో ఎ.రవికుమార్, రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ, కూటమి నేతలు సిదిరెడ్డి శ్రీనివాసరావు, సిదిరెడ్డి సూర్యనారాయణ, వేగి గోపీకృష్ణ, ఎస్.కె.బాబర్, కర్రి సత్యనారాయణ, ఉల్లింగల రమేష్, బుదిరెడ్డి గంగయ్య, కర్రి సత్యనారాయణ, చిరంజీవి, అఖిల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తేగాడలో దివ్యాంగురాలికి పింఛను అందజేస్తున్న కొణతాల, పీలా

పరవాడ : ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లను శుక్రవారం పరవాడ బీసీ కాలనీలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్ల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, కూటమి నాయకులు వియ్యపు చిన్న, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌గా రమణ బాధ్యతలు



అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా బీవీ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సెక్రటరేటరీ సెక్షన్‌లో ఉన్న ఈయనను ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా మెప్మా ఏపీడీ యల్లపు సంతోష్‌కుమార్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో జడ్సీ అయ్యప్పనాయుడు రామచంద్రపురం మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. గత నెల నాలుగో తేదీ నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఎట్టకేలకు ఉన్నతాధికారులు భర్తీ చేశారు.

జీడిమామిడి తోటలకు బీమా పథకం

సబ్బవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీడిమామిడి తోటలకు సంబంధించి స్వచ్ఛంద బీమా పథకాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చినట్టు ఉద్యాన శాఖాధికారిణి కిరణ్మయి తెలిపారు. ఈనెల 15వ తేదీ లోగా రైతులు ప్రీమియం సొమ్ము చెల్లించాలని సూచించారు. ఎకరాకు రూ.1,540 చెల్లించాల్సి ఉంటుందన్నారు. జీడిమామిడి పంట రుణం పొందిన రైతులు బ్యాంక్‌లో స్వచ్ఛంద డిక్లరేషన్ సమర్పిస్తే సరిపోతుందన్నారు. బ్యాంక్ రుణం పొందని రైతులు కో-ఆపరేటివ్ బ్యాంకు, బ్యాంకు అధికారులు, గ్రామ సచివాలయం లేదా నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ యాప్ ద్వారా ప్రీమియం చెల్లించ వచ్చునని వివరించారు. రైతులు ఆధార్ కార్డు, భూమి పత్రాలు, పంట సాగు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌పుస్తకం జెరాక్స్, ఫోన్ నెంబరు తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ వర్ధంతి



ఇందిర విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కశింకోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో ఇందిరా గాంధీ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కత్తెర శ్రీధర్, కాళ్ల సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్ తదితరులు ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సేనాపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

తుమ్మపాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులతో శుక్రవారం మామిడిపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను పక్కతోవ పట్టించి సొంత ప్రయోజనాలకు వాడుకున్నారని ఆరోపించారు. దీంతో కార్మికులకు గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా లబ్ధి చేకూరలేదన్నారు. ఉచిత ఇసుకను ప్రభుత్వమే అన్ని ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసిసరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సీహెచ్.అప్పలరాజు, ఎం. సత్యనారాయణ, గణేష్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రహదారి మరమ్మతు పనులు ప్రారంభం

లంకెలపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం- అనకపల్లి రహదారి మరమ్మతు పనునలు శనివారం పెదముషిడివాడ సమీపం జీజీనగర్ వద్ద ప్రారంభించనున్నట్టు జనసేన పార్టీ పరవాడ మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసకాసులు, నాయకులు కరణం నరసింగరావు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లి రవీంద్ర, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు. కూటమి నాయకులంతా పాల్గొనాల్సిందిగా కోరారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. శుక్రవారం వాతావరణ సమాచారాన్ని ప్రకటించారు. ఈనెల 6తేదీ వరకు పాడేరు, చింతపల్లి, అరకు, రంపచోడవరం డివిజన్లు పరిధిలో కనిష్ఠంగా ఒక మిల్లీమీటర్లు, గరిష్ఠంగా ఐదు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. గాలిలో తేమ 85-90శాతం ఉంటుందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 25-26.2, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14.6-17.6 డిగ్రీలు నమోదవుతుందన్నారు.

10న డీఎస్సీ అభ్యర్థుల శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష

పాడేరురూరల్,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ డీఎస్సీ శిక్షణకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల10వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికార అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ అమరావతి వారి ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత భోజన, వసతి సౌకర్యంతో మూడు నెలల పాటు శిక్షణ పొందేందుకుఆన్‌లైన్ పోర్టల్స్‌లో నమోదు చేసుకున్న వారికి స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల3న నిర్వహించాలని ముందు గా నిర్ణయించామన్నారు. అయితే, అనివార్య కారణాలతో ఈ పరీక్షను ఈ నెల10కి మార్పు చేశామని,అభ్యర్థులుగుర్తించాలని ఆయన కోరారు.

ఎటపాక పీహెచ్‌సీ సిబ్బందిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు

పాడేరురూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిపై దాడిచేసిన బూర శ్రీహరిపై పాడేరులో కేసు నమోదు చేసినట్టు ఏపీ ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర తెలిపారు. గత నెల 29 తేదీ అర్ధరాత్రి లక్ష్మీపురం పీహెచ్‌సీలో నైట్ డ్యూటీలో ఉన్న స్టాఫ్‌నర్స్ పి.సీత, నైట్‌వాచ్‌మెన్ పొడియం రవికుమార్‌లపై మద్యం సేవించి వచ్చిన శ్రీహరి దాడికి పాల్పడ్డాడన్నారు. ఆస్పత్రి తలుపు గొళ్లెం పగలుకొట్టి, బీపీ ఆపరేటర్ మిషన్‌ను ధ్వంసం చేశాడన్నారు. దాడికి నిరసన తెలిపేందుకు సిద్ధమైన ఉద్యోగులను మహేష్ అనే వ్యక్తి బెదిరించడం అన్యాయమన్నారు. బాధిత ఉద్యోగులు ఎటపాక పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో ఆదివాసీ జేఏసీ బృందం శుక్రవారం పాడేరులో జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయడంతో ఈ దాడిపై కేసు నమోదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ నాయకులు బుడిదే మాధవ్, బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన డివైజ్‌లు... పింఛన్ల పంపిణీకి బ్రేక్



బొర్రమామిడి లో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

గూడెంకొత్తవీధి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో డివైజ్‌లు మొరాయించడంతో పింఛన్ల పంపిణీకి అంతరాయం కలిగింది. శుక్రవారం ఉదయం గ్రామ సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే, పలుచోట్ల బయోమెట్రిక్ నమోదు చేసే డివైజ్‌లు పనిచేయక పోవడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. బొర్రమామిడి గ్రామంలో సాయంత్రం వరకు పింఛన్ పంపిణీ కాలేదు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

కొయ్యూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో కినపర్తి పంచాయతీ భీమవరంగ్రామ శివారున పేకాట శిబిరంపై గురువారం సాయంత్రం దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్టు చేసినట్టు కొయ్యూరు ఎస్‌ఐ కిశోర్ వర్మ తెలిపారు. వారినుంచి రూ 73,900 రెండు కార్లు, ఏడు సెల్ ఫోన్లు సీజ్ చేసినట్టు చెప్పారు. సీఐ వెంకటరమణకు అందిన సమాచారం మేరకు మంప ఎస్‌ఐ శంకరరావు సిబ్బందితో ఈ దాడి చేసినట్టు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైన పాల్పడిన చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్‌ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

'టెంట్ ఫర్ రెంట్ల'కు అనుమతి తప్పనిసరి

అరకులోయ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు అతిథ్యమిచ్చేందుకు పలు టెంట్ ఫర్ రెంట్ పేరిట ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసే విడిదిలకు నిర్వాహకులు విధిగా అనుమతి పొందాలని శుక్రవారం ఎంపీడీవో ఎ.లవరాజు అన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాలమేరకు టెంట్‌లు నిర్వహించేవారు ముందుగా పోలీస్, ఫైర్, ఎలక్ట్రికల్, రెవెన్యూ శాఖల నుంచి నో అబ్జెక్షన్ (ఎన్‌ఓసీ) సర్టిఫికెట్లు తీసుకుని తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. అవసరమైన రుసుము చెల్లించాలన్నారు. టెంట్‌లు ఏర్పాటుచేసే క్యాంప్‌ల్లో పారిశుధ్యం, తాగునీరు, టాయిలెట్స్ తదితర కనీస సదుపాయాలను కల్పించాలన్నారు. టెంట్ నిర్వాహకులు క్యాంప్ వద్ద పర్యాటకుల వివరాలతో కూడిన రిజిస్టర్, వారి నుంచి ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకోవాలని సూచించారు.

పద్మాపురం గార్డెన్‌కు పూర్వ వైభవం

- ఆధునికీకరణ పనులకు ఐటీడీఏ శ్రీకారం
- రూ. 86 లక్షలతో లైటింగ్ పనులు
- పర్యాటకులకు వీలుగా హట్స్ నిర్మాణం



పద్మాపురం గార్డెన్ ముఖద్వారం

అరకులోయ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో బొటానికల్ గార్డెన్‌గా ప్రాచుర్యం పొందిన పద్మాపురంగార్డెన్ పర్యాటకులు, విద్యార్థులను ఆకట్టుకునేలా ఐటీడీఏ ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. గార్డెన్‌కు మళ్లీ పూర్వవైభవం తీసుకురావడంతోపాటు నేటి అవసరాలకు తగినట్టు పర్యాటకులు తిలకించేలా ఐటీడీఏ పీవో చొరవ తీసుకుంటున్నారు. బొటానికల్ గార్డెన్‌కు తగ్గట్టుగా గార్డెన్‌లో ఉన్న ఎన్నో రకాల అరుదైన ప్లాంట్స్‌ను ప్రత్యేకంగా గుర్తించి వాటి పేర్లు, ప్రాధాన్యతను తెలిపే విధంగా సమాచారంతో కూడిన బోర్డుల ఏర్పాటు, గార్డెన్ అంతా లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు జోరుగా జరుగుతున్నాయి. హుద్‌హుద్ తుఫాన్ కారణంగా పద్మాపురం గార్డెన్ చాలా మేరకు ధ్వంసమైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రూ.2 కోట్లతో గార్డెన్‌నుఆధునికీకరించే బాధ్యతను ఉడాకు అప్పగించారు. అనంతరం ఆశించిన స్థాయిలో నిధులురాక, విడుదలైన నిధులకు పనులు చేపట్టలేదు. పర్యాటకులను ఆకర్షించే విధంగా మార్పులు సాగలేదు. సందర్శించిన వారంతా తీవ్ర అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఐటీడీఏ పీవో, ప్రస్తుత ఐటీడీఏ పీవో వి.అభిశేక్ సుమారు రూ. 86 లక్షల వ్యయంతో గార్డెన్‌లో గులాబీ తోట ఎదుట టీహట్స్‌ను నిర్మించి పర్యాటకులు గార్డెన్‌లో విడిదిచేసేలా, వీరికి అవసరమైన క్యాంటీన్‌ను అందుబాటు లోకితీసుకువచ్చారు.విజయదశమి నుంచి హోట్ ఎయిర్‌బెలూన్‌ను అందు బాటులోకి తీసుకువచ్చారు. వీటితోపాటు పద్మాపురం గార్డెన్‌ను రాత్రి 9 గంటలవరకు పర్యాటకులు సందర్శించేలా లోన అంతా సుమారు 3 కిలో మీటర్ల పొడవునా ఆర్మ్‌డ్ కేబుల్ వైరింగ్ చేపడుతున్నారు. ఎక్కడికక్కడ స్ట్రీట్ లైట్స్, ఫ్లడ్ లైట్స్‌తోపాటు ఫోకస్ లైట్లు , గార్డెన్‌లోని వృక్షాలకు రోప్ లైటింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ లైటింగ్ సౌకర్యం మరోపదిరోజుల్లోఅందుబాటులోకి రానుంది. లాన్స్ తిలకించేందుకు వీలుగా లైట్ ఆర్చ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు.



వృక్షాలకు రోప్‌వే లైటింగ్ కేబుల్



రంగులతో సిద్ధమైన స్ట్రీట్‌లైట్స్

ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా పక్షపాతి

- టీడీపీ అరకు ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపం పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీకి శ్రీకారం చుట్టినట్టు టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఉచితగ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్య క్రమాన్ని దొన్నుదొర, ఆ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, తెలుగు మహిళా నేతలు, అధికారులతో ప్రారంభించారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా పక్షపాతి అని అన్నారు. వారి ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్‌సిలిండర్లను అందిస్తున్నట్టు తెలిపారు. మరో వైపు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. సంక్రాంతి నాటికి పల్లెపండగలో ప్రారంభించిన పనులన్నీ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కల్పనకు మెగా డీఎస్సీని ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, సాయిరాం, మహదేవ్, లైకోన్, నాగరాజు, పెదలబుడు వైస్ సర్పంచ్ చందూ విజయనిర్మల, మహిళ నేతలు బుర్జలక్ష్మి, బొరిబొరి లక్ష్మి, ద్రౌపతి, కళావతి,వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



దీపం థకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సియ్యారి దొన్నుదొర

టీడీపీ సభ్యత్వంతో బీమా

గూడెంకొత్తవీధి: టీడీపీ సభ్యత్వం పొందిన వారికి బీమా సదుపాయం కల్పిస్తున్నట్టు టీడీపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేశ్ నాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని దేవరాపల్లి గ్రామ పంచాయతీలో టీడీపీ కార్యకర్తలు సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యుడికి భరోసా కల్పిస్తూ రూ. ఐదు లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే, సాధారణంగా మృతి చెందితే తక్షణ సహాయంగా రూ.పదివేలు పరిహారంగా అందిస్తారన్నారు. కార్యకర్తలకు సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో టీడీపీ ఓటు బ్యాంక్ పెరిగిందన్నారు. పార్టీకి ప్రజాదరణ పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అభిమానులు, మద్దతుదారులందరికీ సభ్యత్వ నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, స్థానిక సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు, నాయకులు శ్రీనివాస్, పాల్గొన్నారు.

దీపం పథకంతో ఉజ్వల భవిష్యత్తు

డుంబ్రిగుడ: దీపం పథకం-2 పథకంతో గిరిజన కుటుంబాల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వం నాంది పలికిందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. స్థానిక గ్యాస్ గోదాములో దీపం పథకం ప్రారంభించారు. గిరిజన మహిళ లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన కుటుంబాలకు ఏడాదికి మూడు సిలిండర్లు పంపిణీ చేస్తున్న వివరించారు. ఈ కార్యక్రమంతో ఎంపీటీసీ సభ్యురాలు గీత, స్వామి, గ్యాస్ గోదాము నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ఉచిత సిలిండర్లను పంపిణీ

కార్తీక పూజలు ప్రారంభం



సీలేరు శివాలయంలో ఆకాశ దీపంవెలిగిస్తున్న భక్తులు

సీలేరు, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో శుక్రవారం పలు ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపాల ను వెలిగించారు. దీపావళి అమావాస్య అనంతరం కార్తీకమాసం శుక్రవారం నుంచి ప్రారంభం కావడంతో సీలేరులోని మారెమ్మ ఆలయం, శివాలయం, రామాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులతో ఆలయ ప్రాంగణాల్లో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం ఆకాశ దీపాలను వెలిగించారు. మారెమ్మ ఆలయంలో ఏపీ జెన్‌కో సబ్ ఇంజనీర్ శ్రీనివాస్ దంపతులు, శివాలయం వద్ద కిరాణా వ్యాపారి శ్రీనివాస్ దంపతులు వారి చేతులు మీదుగా ఆకాశ దీపాలను వెలిగించారు.

'గిరిజనులతోనే షెడ్యూల్డ్ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి'

పాడేరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2024 ప్రకటనకు ముందే షెడ్యూల్డ్ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలనిఅఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ముఖి శేషాద్రి, బోయపల్లి సింహాచలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన్ భవన్‌లో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆదివాసీ సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం దృష్టికి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల్లో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయం తీసుకువెళ్లాలని తీర్మానించారు. స్థానిక ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ వర్తించే విధంగా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల కోసం చట్టాన్ని రూపకల్పన కోసం పోరాటానికి సిద్ధం కావాలని నిర్ణయించారు. రాజ్యాంగం కల్పించిన ఆదివాసీ హక్కుల అమలు, వాటి పరిరక్షణకు నిరుద్యోగులు, యువత ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు పలాసి కృష్ణారావు, ముఖ్య సలహాదారు సోమెలి చెల్లయ్య, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్మోహన్‌రావు, డీటీఎఫ్ జిల్లా నాయకులు మినుముల ప్రసాదరావు, వికాష్, జీటీఏ జిల్లా నాయకులు పి. కన్నన్న, యూటీఎఫ్ జిల్లా నాయకులు సీహెచ్. నాగేశ్వరరావు, జీఎస్‌యూ నాయకులు కె.సురేష్, కె.మన్మధరావు, హెచ్ఎంల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పూర్ణచందరరావు, ఎం.శోభన్, టీడబ్ల్యూటీయూ జిల్లా నాయకులు కె.ప్రసన్న, ఏబీవీపీ నాయకులు సూర్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు

ఉపాధ్యాయులకు 'తర్ల్'పై శిక్షణ తరగతులు

డుంబ్రిగుడ, నవంబరు 1 (ఆంధజ్యోతి): స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులకు రెండో విడత టీచింగ్ ఎట్ ద రైట్ లెవెల్(తర్ల్) శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీ సందర్శించి మాట్లాడారు. మూడు రోజుల పాటు ఈ శిక్షణ జరుగుతుందన్నారు. అనంతరం ఇక్కడ నేర్చుకున్న అంశాలతో పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుందరరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీ

ఆనందోత్సాహాల మధ్య దీపావళి

పాడేరురూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు గురువారం దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరిపారు. స్థానిక కళాశాల క్రీడా మైదానంలో వ్యాపారులు 17 షాపులను ఏర్పాటు చేసి మందుగుండు సామగ్రి విక్రయాలు సాగించారు. ఈ షాపులు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. కుమ్మర్లు చేసిన మట్టి ప్రమిదలు అమ్మకాలు జోరుగా సాగాయి. మోదకొండమ్మ ఆలయంలో గురువారం దీపావళి వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డీఈఈవో జి.అప్పారావునాయుడు, ఆలయ కమిటీ సభ్యులు బి.వెంకటరమణ, కె.రాధాకృష్ణన్ నాయుడు, కొణతాలసతీష్, కె.చంద్రమోహన్, కె.వెంకటరమణ, ఎం.ప్రసాద్‌రాజు, జి.ప్రకాశరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అనాథ ఆశ్రమంలో...

పాడేరురూరల్: పాడేరులోని నవజీవన్ అనాథ ఆశ్రమం విద్యార్థుల మధ్య టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు గురువారం రాత్రి దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉన్న 80 మంది చిన్నారులకు బాణసంచా ఆయన కొనుగోలు చేసి గ్రామ పెద్దలతో కలిసి దీపావళి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు సోదరి, మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్యదొర, బీసీ సెల్ నాయకులు కొణతాల ప్రశాంత్, పశువైద్యాధికారి సురేష్, భీమ్‌నాయుడు, ఆశ్రమ నిర్వాహకులు సద్ధు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో దీపావళి జరుపుకున్న టీడీపీ నేత సుబ్బారావు తదితరులు

పేదలకు దుస్తులు పంపిణీ

అనంతగిరి: మండలంలోని మారుమూల లంగుపర్తి పంచాయతీ దిగువపట్టి గ్రామంలోని టీడీపీ మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు ఆధ్వర్యంలోని నిరుపేద గిరిజన మహిళలకు చీరలు, చిన్నారులకు దుస్తులను దీపావళి పురస్కరించుకుని గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోని పార్టీ జిల్లాకార్యవర్గ సభ్యుడు ఎం.జోగులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో మతాబులు వెలిగిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు: దీపావళి పండుగను వాడ వాడలా ఘనంగా జరిపారు. ఇళ్ల ముందు దీపాలు వెలిగించి, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆముదం, చెరకు గెడలతో జ్యోతులు వెలిగిస్తూ సాంప్రదాయ ప్రకారం పండుగ నిర్వహించారు. అనంతరం ఇంటిల్లిపాది కలసి బాణసంచా కాల్చారు.

దీపావళి రోజున విషాదం

- జ్వరంతో నాలుగునెలల చిన్నారి మృతి
- కన్నీమున్నీరవుతున్న గిరిజన దంపతులు



తల్లి ఒడిలో మృతి చెందిన చిన్నారి

అనంతగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున ఆ గిరిజన దంపతుల ఇంట చీకట్లు అలుముకున్నాయి.ముద్దులుగొలిపే నాలుగు నెలల చిన్నారి జ్వరంతో బాధపడుతూ గురువారం మృత్యువు ఒడికి చేరుకుంది. తన నవ్వులతో వెలుగులు పంచాల్సిన ఆ పసికందు కనిపించని తీరాలకు వెళ్లిపోయింది. ఈ విషాద ఘటన మండలంలోని బొర్రా పంచాయతీ గేటువలసలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వంతాల సోని, పుష్ప దంపతులకు నాలుగు నెలల కిందట చిన్నారి జన్మించింది. గత మూడు రోజులు విపరీతమైన జ్వరంతో బాధపడుతుండడంతో అనంతగిరి పీహెచ్‌సీకి తరలించి, వైద్యసేవలను అందించినప్పటికీ ఆ చిన్నారి మృతిచెందింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పీహెచ్‌సీలో సరైన వైద్యం అందించి ఉంటే తమ పాప బతికుండేదని, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీ స్థాయిలో చిన్నారులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందించేలా చర్యలు చేపట్టాలని, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘా లు డిమాండ్ చేశాయి.

బాల్య వివాహాలపై కేసులు నమోదు

- ఐసీడీఎస్ పీవో సూర్యలక్ష్మి



అవగాహన కల్పిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

అనంతగిరి, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలపై కేసులు నమోదు చేస్తామని ఐసీడీఎస్ జిలా ప్రాజెక్టు అధికారి సూర్యలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని చిలకలగెడ్డ సచివాలయంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుకునే వయస్సులో పెళ్లి పేరిట బాలికల జీవితాలను నాశనం చేయొద్దని హితవు పలికారు. కాదని చేస్తే ఆ తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 14 ఏళ్ల నుంచి 18 లోపు వివాహాలు చేయడం ద్వారా జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం కొత్తూరు కేజీబీవీ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సీడీపీవో సంతోషికుమారి, సూపర్‌వైజర్ సునీత, ఏఎస్‌వో సుశీల, సర్పంచ్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో 93 శాతం పింఛన్ల పంపిణీ

చింతపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో తొలిరోజు 93శాతం పింఛన్లు పంపిణీ పూర్తిచేసినట్టు స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇన్‌చార్జి ఎంపీడీవో, లోతుగెడ్డ జంక్షన్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సాంకేతిక సమస్యలతో కొన్ని చోట్ల డివైజ్‌లు మొరాయించినప్పటికి సాయంత్రానికి మెజారిటీ పంచాయతీల్లో 95శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు లబ్ధిదారుల గృహాల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యవతి, మహేంద్ర, కేశవరావు పాల్గొన్నారు.



లోతుగెడ్డ జంక్షన్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నేత పూర్ణచంద్రరావు

డుంబ్రిగుడ: పింఛన్ల పంపిణీతో వృద్ధులకు సామాజిక భరోసా కలుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. డుంబ్రిగుడ పోతంగి, కొర్రా పంచాయతీల్లో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత, టీఎన్‌టీయూసీ నేత స్వామి, యూనిట్ ఇన్‌చార్జి బోంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు హౌసింగ్ ఏఈ అక్రమాలపై ఫిర్యాదు

పాడేరు/ పెదబయలు నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెదబయలు హౌసింగ్ ఏఈ అక్రమాలపై తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు మండల వైస్ ఎంపీపీ పాంగి సోనే, టీడీపీ నేతలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పాడేరులో ఈమేరకు వారు శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రమిచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాల్లో పేదల ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తున్నారు. కేంద్రం జన్‌మన్ యోజనలో ఇళ్లను నిర్మిస్తుందని తెలిపారు. అయితే, హౌసింగ్ ఏఈ అక్రమంగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రతి లబ్ధిదారుడు రూ. 5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఆయనపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాంగి దన్ను, కొర్రా సుబ్బారావు, వంతాల పండన్న, మోస్య, శేఖర్‌లున్నారు.



శ్రావణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైస్ ఎంపీపీ, తదితరులు

పోలీసు అమరుల త్యాగం చిరస్మరణీయం

చింతపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని స్థానిక ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు శాంతి భద్రతలు కల్పనకు 24 గంటలూ విధులు నిర్వహిస్తున్నారన్నారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలన్నారు.



చింతపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పోలీసులు

ముంచంగిపుట్టు: స్థానిక ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు గురువారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా ఈ ర్యాలీ సాగింది. అమరులైన పోలీసుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

ముంచంగిపుట్టు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకనకదుర్గమ్మ మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ దసరా పండుగ పురస్కరించుకొని అమ్మవారికి తమ యూనియన్ ఆధ్వర్యంలో పూజలు చేసి మొక్కులు చెల్లించామన్నారు. అనంతరం జీపులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పర్తాపుట్టులో వన సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మండల పరిధిలో గల జీపు యజమానులు, డ్రైవర్లు, సహాయకులు పాల్గొన్నారు.

సూపర్-సిక్స్ అమలుకు కట్టుబడి ఉన్నాం..

▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

▸ నియోజకవర్గంలో ఉచిత గ్యాస్ పంపిణీ

బుచ్చెయ్యపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-సక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో శుక్రవారం ఉచిత గ్యాస్ బండలతో పాటు నవంబరు నెల పించన్ల నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సారథ్యంలో ఏపీ అన్నింటా అభివృద్ధి సాధించగలదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, కూటమి నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, దొండా సన్యాసిరావు, వియ్యపు అప్పారావు, కోరుకొండ రవికుమార్, దేవర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంపై కసరత్తు

రావికమతం: సూపర్-సిక్స్ హామీలలో భాగంగా వచ్చే సంక్రాంతి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సూపర్-6 పథకాలల్లో భాగంగా ఉచిత గ్యాస్ (దీపం పథకం-2)సిలిండర్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన సూపర్-6 పథకాలలో భాగంగా ఇప్పటికే పింఛన్ పెంచారన్నారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన రీ సర్వే అవకతకలపై ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారని, పేదవాడి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ప్రారంబించారని, తాజాగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం కూడా మహిళలకు అందిస్తున్నట్టు చెప్పారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం నవంబరు నుంచి మార్చి 31వ తేదీ వరకు బుక్‌చేసుకున్న అర్హులకు అందిస్తామన్నారు. గత రీ సర్వేలో తప్పులను నూరుశాతం సవరించాలని తహసీల్దార్ వెంకటరమణకు ఆదేశించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణిగోవిందరావు, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీపీ పైల రాజు, ఎంపీటీసీ సభ్యులు గంజి సూర్యనారాయణ,నాగేశ్వరావు,బిజెపి స్టేట్ కౌన్సిల్ గల్లా రాజేశ్వరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఉప్పులూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రావికమతంలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంటలో...

రోలుగుంట: మహిళలకు ఇచ్చిన దీపం పథకం హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని ఎమ్మెల్యే రాజు చెప్పారు. శుక్రవారం రోలుగుంటలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి కానుకగా దీపం-2 పథకంలో ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. సిలిండర్ బుక్ చేసుకున్న 48 గంటల్లో రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుందన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు సబ్బవరపు పెద్దినాయుడు, వుండా రమణబాబు, వి.రమణాజీ, లగుడు సత్తిబాబు, ఉలబాల పోతురాజునాయుడు పాల్గొన్నారు.



కాకర పువ్వొత్తులు కాలుస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు

వాడవాడలా దీపావళి వెలుగులు

నర్సీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ దీపావళి వెలుగులు విరమిమ్మాయి. నర్సీపట్నంలో సభాపతి అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు గురువారం దీపావళి పండగను జరుపుకున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, డాక్టర్ సువర్ణ, కౌన్సిలర్ రాజేశ్, దివ్యశ్రీ దంపతులు, కుటుంబ సభ్యులు బాణసంచా వెలిగించారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, కళావతి దంపతులు, కుమారులు అవినాష్, ఆదర్శ్ పండగను ఘనంగా జపరుపుకున్నారు. డీసీసీ మాజీ ఛైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడు దంపతులు, కుమారుడు వరుణ్ కటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకున్నారు.

మౌంట్‌అబులో ఆధ్యాత్మికతతో కూడిన ప్రశాంతత

నర్సీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మౌంట్‌అబులో ఆధ్యాత్మికతతో కూడిన ప్రశాంతత దొరుకుతుందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో స్పీకర్ అయ్య, పద్మావతి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌంట్‌అబులో మూడు రోజులు గడిపానని, అవకాశం ఉన్నవారు ఒక్క సారైనా సందర్శించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మౌంట్ అబు నుంచి ముఖ్య అతిథిగా రాజయోగి రాంసులోక్, స్థానిక ఇన్‌చార్జి వేణు, లక్ష్మి, లలిత, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ వెంటనే పూర్తిచేయండి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి



పైడిపాల గ్రామంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తతన్న పీడీ శచీదేవి

మాకవరపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే పూర్తిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి ఆదేశించారు. మండలంలో పైడిపాల, కొండలఅగ్రహారం గ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 2,59,778 మందికి పింఛన్లు పంపిణీ కోసం 4,200 మంది సిబ్బందిని ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. ఒకే రోజు పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం అదేశాలు జారీ చేసిందని, అయితే సర్వర్ మొరాయిస్తుండడంతో కొంత అలస్యంగా సాగుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మంగ, పింఛన్ల పంపిణీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ప్రజల ఆస్తుల తాకట్టు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గొలుగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల ఆస్తులు తాకట్టు పెట్టారని, నిత్యావసర సరకుల ధరలపై అధిక భారం మోపారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ఆరోపించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలాగే ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజల నెత్తిన భారం మోపకుండా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కాకముందే విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్టు మీటర్లు ఏర్పాటు చేయడం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గొల్లు గురుబాబు, నాయకులు మేకా సత్యనారాయణ, మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



భీమవరంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కృష్ణాదేవిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమవరం చెక్‌పోస్టులో నార్కోటిక్ డ్రగ్స్ డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు శుక్రవారం కార్లు, ఆటోలు, ఇతర వాహనాలను ఆపి పరిశీలించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రేవతమ్మ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల రవాణాను అరికట్టడానికి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు గురుమూర్తి, నూకరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి... హాజరైన లబ్ధిదారులు

మహిళల కష్టాలకు దీపం-2 పథకంతో చెక్

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింట్లో కన్నీటి కష్టాలు పడకుండా దీపం-2 పథకంతో సీఎం చంద్రబాబు చెక్ పెట్టారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక దేవి ఆడిటోరియంలో శుక్రవారం ఉచిత దీపం కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాదేవి అధ్యక్షతన జరిగిన సభలో బండారు మాట్లాడుతూ మహిళలు వంటింట్లో కర్రల పొయ్యిలతో నానా అవస్థలు పడేవారని, ఈ విషయాన్ని నాటి ప్రధాని అటల్ బిహార్ వాజ్‌పేయి దృష్టికి అప్పటి సీఎం చంద్రబాబు తీసుకువెళ్లారని చెప్పారు. దీంతో ఒక్కసారిగా 20 లక్షల గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేసి మహిళల వంటింటి కన్నీటి కష్టాలను తీర్చారని ఆయన పేర్కొన్నారు. పేద ప్రజల కష్టాలు, కన్నీటిని అర్థం చేసుకొని ఆదుకునే నాయకత్వం లక్షణం కలిగిన సమర్థవంతమైన నేత చంద్రబాబేనని కొనియాడారు. మాడుగుల నియోజకవర్గంలో ఏడాదికి 42,931 మంది లబ్ధిదారులకు రూ.11.52 కోట్లు వెచ్చించి దీపం పథకం అందిస్తున్నట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో 1250 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండరీ ధర 849కే అందించేలా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అనంతరం గ్యాస్ సిలిండరీలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతులు మీదుగా అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, పట్టణ అధ్యక్షుడు రంజిత్‌వర్మ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి లెక్కల కాశిబాబు, నాయకులు సూర్యనారాయణరాజు, డిల్లీ నానాజీ, నాలుగు మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

కాగా, ఎమ్మెల్యే బండారు సాక్షిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలక వాగ్వాదం జరిగింది. తొలి గ్యాస్ కనెక్షన్‌ను పక్కా వైసీపీకి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతులు మీదుగా కొంత మంది నాయకులు కావాలనే అందించేలా ఏర్పాటు చేశారని, వైసీపీ వర్గీయుల ఇళ్లల్లోకి ఎమ్మెల్యేను తీసుకువెళ్లారని పలువురు నేతలు మండిపడ్డారు. పార్టీ కష్టకాలంలో జెండామోసినతమను పక్కన పెట్టారని వాపోయారు. ఈ క్రమంలో స్వల్ప వాగ్యుద్ధం జరగ్గా, ఎమ్మెల్యే మాత్రం కారులో కూర్చొని చోద్యం చూశారని మరికొందరు వాపోవడం విశేషం.



ఎం.బెన్నవరంలో రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డీఈ

రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

నాతవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఇంజనీరు బి.ఎర్రాపాత్రుడు స్పష్టం చేశారు. శుక్రవారం అధికారులతో కలసి వైడీపేట, ములగపూడి బెన్నవరం, నాతవరం గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, కల్వర్టు పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఈ పనులను నాణ్యతాప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ అధికారి పి.వెంకటేశ్వరమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే గ్రామసభల్లో 780 ఫిర్యాదులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

మాకవరపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెవెన్యూ గ్రామసభల్లో 780 పిర్యాదులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ చెప్పారు. శుక్రవారం శెట్టిపాలెంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వే జరిగిన 13 గ్రామాల్లో సభలు నిర్వహించగా, రైతుల నుంచి 780 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, భూ రీ సర్వే డీటీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన

రోలుగుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్ల పంచాయతీ శివారు పెదగరువు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కొండశిఖర గ్రామమైన పెదగరువులో 15 కుటుంబాలకు చెందిన 60 మంది జీవనం సాగిస్తున్నామని, నెల రోజులుగా తాగునీటి కొరతతో నరకం చూస్తున్నామని వారు వాపోయారు. నెల రోజుల్లో నాలుగు సార్లు డోలీ కట్టుకుని రోగులను ఆసుపత్రికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకుందన్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కిల్లో నరసయ్య, కిల్లో డంబు, కిల్లో లక్ష్మి డిమాండ్ చేశారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వాసవీ కళ్యాణ మండపం సంఘం, ఆయుష్మాన్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధి వెలగా నారాయణరావు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధనకై పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణాలు త్యాగం చేయడం చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పౌర సరఫరాల శాఖకు గోవాడ పంచదార

▸ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ: జనసేన ఇన్‌చార్జి రాజు



మంత్రితో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల, పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఉత్పత్తి చేసిన పంచదారను పౌర సరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేయడానికి పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు శుక్ర వారం తెలిపారు. విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి నాదెండ్లను జనసేన జిల్లా ఇన్‌చార్జి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి గోవాడ ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి గురించి వివరించినట్టు చెప్పారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పంచదార కొనుగోలు చేసి ఫ్యాక్టరీని ఆదుకోవాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే బకాయిలు ఉండడంతో రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను మంత్రికి నివేదించామని, పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు.

చెరకు సాగు పెంచాలి: ఏవో నాగేశ్వరరావు

బుచ్చెయ్యపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెరకు సాగును పెంచాలని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఏవో ఎస్వీ.నాగేశ్వరరావు సూచించారు. పల్లె పల్లెకు చెరకు సాగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దిబ్బిడిలో సభ్య రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకు సాగు పడిపోవడంతో ఫ్యాక్టరీ పురోగతి దెబ్బతింటుందన్నారు. టన్ను చెరకు రూ.3150 చొప్పున అందిస్తామని, రాయితీపై నూతన చెరకు వంగడాలను పంపిణీ చేస్తామని తెలిపారు. పెరిగిన పెట్టుబడులతో చెరకు సాగు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని, కాటాకు సరఫరా చేసిన చెరకును సకాలంలో ఫ్యాక్టరీ తరలించడంలో యాజమాన్యం విఫలం కావడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, వైస్ ఎంపీపీ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ఫీల్డ్‌మెన్ వేపాడ శ్రీనివాసరావు, చిన్ని హరిహరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కింతాడలో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ నరసింహనాయుడు

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నియోజకవర్గంలోని కింతాడ పంచాయతీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురకుగ్గా జరుగుతున్నదని పార్టీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ నరసింహనాయుడు చెప్పారు. పంచాయతీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా చేపడుతున్నామన్నారు. కార్యకర్తలు ఉత్సాహంగా సభ్యత్వ నమోదు చేయించుకుంటున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారికి త్వరలో గుర్తింపు వస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

గిట్టుబాటు లేక చెరకు సరఫరాకు వెనుకంజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చీడికాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెరకు పండించిన రైతుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతోనే షుగర్ ఫ్యాక్టరీకి వేయలేకపోతున్నారని సీడీసీ ఛైర్మన్ సుంకర శ్రీనివాసరావు అన్నారు. ఖండివరం గ్రామంలో శుక్రవారం గోవాడ షుగర్స్ సిబ్బంది, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుతో పాటు పలువురు రైతులు మాట్లాడుతూ చెరకు పండించేందుకు వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని, దానికి తగ్గ ఫ్యాక్టరీ యాజమాన్యం గిట్టుబాటు ధర కల్పించకపోవడం, ఒకవేళ చెరకు సరఫరా ఇచ్చే పేమెంట్లు సకాలంలో ఇవ్వకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఫ్యాక్టరీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

నర్సీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పంచారామాల శైవక్షేత్రాలు దర్శనం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని పంచారామ క్షేత్రాల దర్శనం కోసం నర్సీపట్నం డిపో నుంచి ప్రతీ ఆదివారం రాత్రి బస్సు బయలు దేరుతుందని, సోమవారం దర్శనం చేయించి మంగళవారం ఉదయానికి తీసుకురావడం జరుగుతుందని చెప్పారు. పంచారామాలు క్షేత్రాలకు పల్లెవెలుగు బస్సు పెద్దలకు రూ.900, పిల్లలకు రూ.680, అల్ట్రా పల్లె వెలుగు పెద్దలకు రూ.1080, పిల్లలకు రూ.810, ఎక్స్ ప్రెస్ బస్సు పెద్దలకు రూ.1200, పిల్లలకు రూ.900, అల్ట్రా డీలక్స్ సర్వీసు పెద్దలకు రూ.1450, పిల్లలకు రూ.1090 చార్జీలు తీసుకోవడం జరుగుతుందని డీఎం తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్‌తో పాటు డిపో కౌంటర్ వద్ద రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. కార్తీక మాసంలో పిక్నిక్ కోసం పర్యాటక ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు చార్జీలో పది శాతం రాయితీ కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

వడ్డాది ఎస్సీ కాలనీలో తాగునీరు కలుషితం

బుచ్చెయ్యపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వడ్డాది సంతబయలు వద్ద ఎస్సీ కాలనీలో మురుగునీరు కలవడంతో రక్షిత నీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతున్నదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో కల్యాణ మండపం, ప్రాథమిక పాఠశాల వద్ద తాగునీరు సరఫరా చేసే పైపులు డ్రైనేజీలో ఉన్నాయి. పైపులు లీకు కావడంతో డ్రైనేజీ నీరు తాగునీటితో పాటు సరఫరా అవుతున్నదని కాలనీ వాసులు తెలిపారు. ఈ విషయాన్ని వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జీడిమామిడి రైతులు బీమా పథకంలో చేరాలి

కె.కోటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రబీలో జీడిమామిడి తోటలకు ప్రభుత్వం స్వచ్ఛంద బీమా పథకం ప్రవేశపెట్టిందని, రైతులు ఈ పథకంలో చేరాలని ఉద్యానవన శాఖ అధికారి కిరణ్మయి సూచించారు. మండలంలోని సూదివలస, పాతవలస, మర్రివలస గ్రామాల్లో శుక్రవారం జీడిమామిడి తోటలను ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో సాగవుతున్న జీడి పంటలను బీమా పథకంలో చేర్చారన్నారు. ఒక ఎకరా జీడి తోటకు రైతు రూ.1540 చెల్లించాలని, ఎన్ని ఎకరాలైనా బీమా చేసుకోవచ్చని ఆమె చెప్పారు. పంట నష్టపరిహారం కింద ఎకరాకు రూ.30,800 అందుతుందన్నారు. ఈ నెల 15వ తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించాలని స్పష్టం చేశారు.

జాలంపల్లిలో పూరిల్లు దగ్ధం

మాడుగుల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఓ పూరిల్లు దగ్ధమైంది. యడ్ల సంతోశ్‌కు చెందిన ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఇంటిలోని నిత్యావసర సరకులు, ఇతర వస్తువులు మంటల్లో కాలి బూడిదయ్యాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావు తెలిపారు.

సుపథ ప్రతిభా పరీక్షలు రేపు

దేవరాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షలను ఈ నెల 3న నిర్వహించనున్నట్టు యూవీఎన్ రాజు తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు తరగతుల వారీగా వర్ణమాల, పద్యాలు, శ్లోకాలు, గేయాల రచన పోటీలను ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటలు వరకు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో దాదాపు 30 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చోడవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, 6న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు.

నక్కదాడిలో గాయపడ్డ బాధితులకు అధికారుల పరామర్శ

కృష్ణాదేవిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నక్క దాడిలో గాయపడ్డ ఏఎల్ పురం గ్రామానికి చెందిన లగుడు కొండబాబు, మాకిరెడ్డి రాములను అటవీ శాఖాధికారులు గురువారం పరామర్శించారు. కృష్ణాదేవిపేట అటవీ రేంజర్ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజర్ సత్యనారాయణ, గొలుగొండ అటవీ సెక్షన్ అధికారి లక్ష్మణరావు తదితరులు బాధితులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. వారి వెంట అటవీ అధికారులు గోరేసు, గణపతి ఉన్నారు.

పటేల్‌కు ఘన నివాళులు

చోడవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. ఈ పటేల్ గొప్పతాన్ని అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. అనంతరం పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐవీ సత్యవతి, ఎస్ఎస్ఎస్ పీవోలు రత్నభారత్, మాల్యాద్రి బి.పిచ్చమ్మ, లెక్చరర్లు పాల్గొన్నారు.

చీడికాడ: తహసీల్దార్ కార్యాలయంలో వల్లబాయ్‌పటేల్ జయంతి నిర్వహించారు. డీటీ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిబ్బంది సిహెచ్.సత్యనారాయణ, జివి.మూర్తి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యదాయకం.. కార్తీకం!



నదీ స్నానంతో బహుళ ప్రయోజనం

- వ్యాధి నిరోధక శక్తి పెరిగే అవకాశం
- ఉపవాస దీక్షతో నూతనోత్తేజం
- వన భోజనాలతో సర్వమానవ సౌభ్రాతృత్వం
- నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం

కూర్మన్నపాలెం/ సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): **హరి,హరులకు ప్రీతికరమైనదిగా భావించే కార్తీక మాసం సర్వ మానవాళికిగా ఆరోగ్య ప్రదాయిని. ఈ మాసంలో ఆచరించే అనేక నియమాలు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో సహాయపడతాయి. ప్రాతఃకాలంలో నదీ స్నానం, దీపారాధన, ఉపవాస దీక్ష, వనభోజనం ఇలా... అన్నింటికీ ప్రత్యేకత ఉంది. ఆధ్యాత్మిక చింతన ఉంటే అన్నీ దరిచేరుతాయని, వాటిని నియమానుసారం పాటిస్తే ఫలితాలు లభిస్తాయని పెద్దల ఉవాచ. ఈ నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణకు పాటించాల్సిన నియమాలన్నింటినీ ఆధ్యాత్మికతతో మేళవించి అందించారు. ఈ మాసమంతా వీటిని పాటిస్తే పరిసరాల పరిశుభ్రతతో పాటు చక్కని ఆరోగ్యం, సర్వమానవ సౌభ్రాతృత్వం అలవడతాయని ప్రతీతి.**

నేటి యువతకు మన పండుగలు, వాటి విశిష్టత తెలియడం లేదు. వాటి ప్రాముఖ్యతను అందికీ తెలియజేయాల్సిన అవసరం ఉంది. కార్తీకమాసంలో ఆచరించాల్సిన నియమాలు, పాటించాల్సిన పద్ధతులు వివరించి, అంతా ఆచరించేలా చేస్తే ఆరోగ్య రహస్యాలు అవగతమవుతాయి. ఆచార వ్యవహారాలు, నియమ నిబంధనలలో పూర్వీకులు ఆరోగ్య రహస్యాలను పొందుపరిచారు. వాటిని పాటించకపోవడంతోనే శారీరక రుగ్మతలు పెరుగుతున్నాయి. ప్రస్తుతతంతరం కార్తీకం అంటే కేవలం పిక్నిక్‌ల మాసంగా భావించే పరిస్థితి ఉంది.

ఆరోగ్యంగా ఉంచే ప్రాతఃకాలస్నానం

సాధారణంగా చలికాలం ఆరంభంలోనే కార్తీక మాసం వస్తుంది. ఈ సమయంలో నదులు, బావులు, సముద్రంలో చంద్రుని ప్రభావం అధికంగా ఉంటుంది. వేకువజామున వాటిలో స్నానమాచరిస్తే అనారోగ్య సమస్యలు తొలగుతాయి. జలుబు, దగ్గు, చీడ,పీడల నుంచి విముక్తి లభిస్తుంది. ప్రతిరోజూ శిరఃస్నానంతో కళ్లకు మేలు జరుగుతుంది. చల్లని నీటితో స్నానం చేస్తే రక్తప్రసరణ సవ్యంగా సాగుతుంది. సాధారణంగా నదులు కొండల్లో పుడతాయి. అక్కడి ఔషధ మొక్కల ప్రభావం ఆ నీటిలో ఉంటుంది. అందులో స్నానమాచరిస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడంతో



శరీరానికి బద్ధకం ఆవరిస్తుంది. దీనిని అధిగమించేందుకు తెల్లవారుజామునే నిద్ర లేవడం, చల్లని నీళ్లతో స్నానం చేయడం, ఆలయాలు, ఇంటి ఆవరణలోని తులసికోట చుట్టూ ప్రదక్షిణలు మేలు. పెద్దలు ఆధ్యాత్మికతకు ముడిపెట్టి చెప్పిన అనేక నియమాల్లో అంతర్లీనంగా ఆరోగ్య రహస్యాలు ఇమిడి ఉన్నాయి.

పరిశుభ్రతకు చిరునామా...

కార్తీకమాసంలో ప్రతిరోజూ ఇంటి ముందు ఆవుపేడతో కళ్లాపి చల్లి, ముగ్గులు పెట్టడం వల్ల క్రిమికీటకాలు తొలగిపోతాయి. ఆవుపేడలో బ్యాక్టీరియా, వైరస్‌లను నాశనం చేసే రసాయనాలుంటాయి. దీనవల్ల వ్యాధులు దూరమవుతాయి. ఫలితంగా ఆరోగ్యం సిద్ధిస్తుంది. తులసిమొక్క చుట్టూ ప్రదక్షిణ చేస్తే దాని మీదుగా వచ్చే గాలి అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది.

ఆలయాల్లో తీర్థం విశిష్టత

ఆలయాల్లో అర్చకులు ఇచ్చే తీర్థం పరమ ఔషధం. ఇందులో పచ్చ కర్పూరం, పటిక, తులసి, కొబ్బరి నీళ్లు, సుగంధ ద్రవ్యాలు మిళితమై ఉంటాయి. దీనివల్ల శరీరంలోని వేడి తగ్గుతుంది. మలినాలు తొలగుతాయి. నోటి సంబంధ వ్యాధులు నయమవుతాయి. గొంతు శుభ్రపడుతుంది.

ఉపవాసంతో సత్ఫలితాలు

కార్తీకమాసంలో ఉపవాసం చేయడం ఆనవాయితీ. శరీరంలోని అవయవాలు చైతన్యవంతం కావడానికి ఇది ఉపయోగపడుతుంది. అన్నానికి బదులు పండ్లు తినడం వలన ప్రొటీన్లు, ఖనిజ లవణాలు, విటమిన్లు, పుష్కలంగా లభిస్తాయి. పగలంతా ఉపవాసం ఉండి రాత్రి ఆహారం తీసుకుంటే గ్యాస్ట్రబుల్‌తో బాధపడే వారికి ఉపశమనం లభిస్తుంది.

అందరినీ కలిపే వన భోజనం

కార్తీకమాసంలో వన భోజనం ఆరోగ్యమని పురాణాలు చెబుతున్నాయి. ధాత్రి దేవిని పూజించి ఉసిరి చెట్లున్న వనంలో భోజనాలు చెయ్యడం వలన పుణ్యప్రాప్తి కలుగుతుంది. ఉసిరి చెట్లను తాకుతూ వచ్చే గాలి ఔషధ గుణాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకాదు మానవులంతా ఒక్కటే అనే సర్వమానవ సౌభ్రాతృత్వానికి తార్కాణంగా వనభోజనాలకు ప్రతీతి. సాధారణంగా కార్తీకమాసంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మిత భోజనం, రాత్రి పండ్లు పాలు తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన అన్ని రకాల ఖనిజాలు, ప్రొటీన్లు, లవణాలు అందడంతో నూతనోత్తేజం కలిగి, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది.

అచ్యుతాపురంలో ఇసుక దందా

... 3వ పేజీ తరువాయి

చుట్టుపక్కల వున్న గెడ్డలు, శారదా నదిలో నుంచి ఇసుక తీసుకువచ్చి అమ్ముకునేవారు. శ్రీకాకుళం జిల్లాలోని నదుల్లో వరద తగ్గుముఖం పట్టడంతో అక్కడి నుంచి భారీ టిప్పర్ల ద్వారా ఇసుకను రప్పిస్తున్నారు.

అమ్మకం రేటుపై దళారుల మధ్య గొడవ

శ్రీకాకుళం జిల్లా నుంచి శుక్రవారం తెల్లవారుజామున 12 భారీ టిప్పర్లలో ఇసుక అచ్యుతాపురం-ఎలమంచిలి ప్రధాన రహదారిలో వెదురువాడ వేబ్రిడ్జి దగ్గరకు చేరుకుంది. టన్ను ఇసుక ఎంత ధరకు అమ్మాలన్నదానిపై దళారుల మధ్య గొడవ జరిగింది. ఒక దశలో ఇద్దరు వ్యక్తులు కొట్టుకున్నారు. మిగిలిన వారు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. చివరకు టన్ను ఇసుక రూ.1,200కు విక్రయించాలని నిర్ణయించుకున్నారు. అనంతరం ఇసుక లారీలను తమ కేంద్రాలకు తీసుకుపోయి అమ్మకాలు ప్రారంభించారు. అచ్యుతాపురంలో బహిరంగంగా అక్రమ వ్యాపారం జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

రైల్వే పార్శిల్ క్లోజ్!

... 3వ పేజీ తరువాయి

చెబుతున్నారు. అల్లూరి జిల్లా నుంచి కాఫీ గింజలు, అటవీ ఉత్పత్తులు, అనకాపల్లి నుంచి బెల్లం వంటి వాటిని రైల్వే స్టేషన్ ద్వారా ఎగుమతి చేస్తుంటారు. ఇంకా ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉద్యోగులు తమ ద్విచక్ర వాహనాలు, గృహ వినియోగ వస్తువులను పార్శిల్ బుకింగ్ ద్వారా గమ్యస్థానానికి తీసుకెళుతుంటారు. ఆకస్మికంగా పార్శిల్ విభాగాన్ని ఎత్తేయడంతో ఇకముందు రైళ్లలో సరకు రవాణా చేయాలంటే విశాఖపట్నం వెళ్లాల్సి ఉంటుంది. దీంతోపాటు అనకాపల్లిలో ఎన్నో ఏళ్లుగా వున్న రైల్వే సరకు రవాణా విభాగం మూత పడడంతో ఇక్కడ పనిచేసే రైల్వే ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీచేశారు. కానీ సుమారు 20 నుంచి 30 మంది హమాలీలు ఉపాధి కోల్పోనున్నారు. తమ తాత, తండ్రుల కాలం నుంచి రైల్వే స్టేషన్‌లో సరకు రవాణా విభాగంలో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నామని, 'స్మార్ట్' పేరుతో రైల్వే స్టేషన్‌లో సరకు రవాణా విభాగాన్ని ఆకస్మికంగా మూసివేస్తే తాము రోడ్డున పడతామని హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో సరకు రవాణా బుకింగ్ కౌంటర్‌ను ఎత్తివేయడం సరికాదని, సరకు రవాణా విభాగాన్ని కొనసాగించాలని వ్యాపారులు స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను, ఎంపీ సీఎం రమేశ్‌ను కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

గృహోపకరణాల షోరూమ్‌లో అగ్నిప్రమాదం

- రూ.60 లక్షలకుపైగా ఆస్తి నష్టం

అనకాపల్లి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కూరగాయల మార్కెట్‌కు ఆనుకుని శ్రీ వర ఎంటర్‌ప్రైజెస్ అండ్ హోమ్ అప్లయన్స్ షోరూమ్‌లో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణంలో ఉన్న వస్తు సామగ్రి మొత్తం కాలిపోయింది. రూ.60 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించిందని అంచనాగా చెబుతున్నారు. పట్టంలోని గవరపాలేనికి చెందిన కాండ్రేగుల వరప్రసాద్ ఏడాది క్రితం 'శ్రీ వర ఎంటర్‌ప్రైజెస్ అండ్ హోమ్ అప్లయన్స్ సేల్స్ కమ్ సర్వీసింగ్' షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. మిక్సీలు, గ్రైండర్లు, గ్యాస్ స్టౌలు, ఫ్యాన్లు, కుక్కర్లు, తదితర గృహోపకరణాలను ఇక్కడ విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఈ దుకాణంలో నుంచి పొగలు రావడాన్ని కూరగాయల మార్కెట్



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



కాలిపోయిన గృహోపకరణాలు

వద్దకు వచ్చిన ఒక రిక్షా పుల్లర్ గమనించాడు. వెంటనే షోరూమ్ బోర్డుపై ఉన్న నంబరుకు (యజమాని) ఫోన్ చేసి సమాచారం అందించాడు. వరప్రసాద్ వెంటనే బయలుదేరి దారిలోనే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఫోన్ చేసి చెప్పారు. అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు ఈధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను నివారించేందుకు చర్యలు చేపట్టారు. అయితే లోపల నుంచి మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతుండడతో దుకాణం వెనుక వైపు గోడను పగులగొట్టి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే మిక్సీలు, గ్రైండర్లు, గ్యాస్ స్టౌవ్‌లు, ఫ్యాన్లు, కుక్కర్లు, తదితర గృహోపకరణాలతోపాటు సర్వీసింగ్‌కు వచ్చిన వస్తువులు కూడా కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు భావిస్తున్నారు. కాగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఏపీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ శుక్రవారం ఉదయం దుకాణం వద్దకు వెళ్లి పరిశీలించారు. అగ్నిప్రమాదం వల్ల వరప్రసాద్‌కు భారీ నష్టం వాటిల్లడం దురదృష్టరమని అన్నారు.

ఐదేళ్లలో ఉచిత గ్యాస్ సిలిండర్లకు రూ.11 వేల కోట్లు వ్యయం

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చే ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం కూటమి ప్రభుత్వం వచ్చే ఐదేళ్లలో రూ.11 వేల కోట్లు ఖర్చు పెడుతుందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం దీపం-2 పథకాన్ని నియోజకవర్గస్థాయిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 1999లో దీపం పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామన్న ఎన్నికల హామీ మేరకు ఇప్పుడు రాష్ట్రంలో కోటి 55 లక్షల మంది లబ్ధిదారులకు పథకాన్ని అందజేస్తున్నామని చెప్పారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈ పథకం ద్వారా 81,274 మంది లబ్ధి పొందుతున్నారని ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అప్పులు మిగిల్చినా, సీఎం చంద్రబాబు రోడ్లు, కాలువలకు నిధులు మంజూరు చేస్తున్నారని ఆయన చెప్పారు.

మూడు నెలల సమయంలో నియోజకవర్గంలో రూ.41 కోట్లు మంజూరు చేశామన్నారు. సమర్థత గల ప్రభుత్వానికి, అసమర్థ ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనించాలని స్పీకర్ అయ్యన్న కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, అడిగర్ల అప్పలనాయుడు, లాలం శ్రీరంగ స్వామి, ఆర్‌వై పాత్రుడు, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీ అమలు

- చెప్పినట్టుగానే ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
- రాష్ట్ర హోం మంత్రి వి.అనిత
- 'పేట'లో దీపం-2 పథకం ప్రారంభం
- వార్నింగ్‌లు ఉండవ్.. చర్యలే
- అధికారులపై మంత్రి ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట, నవంబరు 1: ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం స్థానిక పీఆర్ అతిథిగృహం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉచిత వంట గ్యాస్ సిలిండర్ 'దీపం-2' పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వైసీపీ హయాంలో వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, అప్పట్లో మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని చంద్రబాబునాయుడు దీపం-2 పథకం పేరుతో ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారని అన్నారు. వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీల్లో నిధులు లేకుండా చేసి సర్పంచులకు చేతులకు సంకెళ్లు వేశారని, ఇపుడు కూటమి ప్రభుత్వంలో ఆర్థిక ఆంక్షలు తొలగిపోయి, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో గతంలో తాము వేయించిన రోడ్లు తప్ప, గత ప్రభుత్వ హయాంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని అన్నారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డును డబుల్ లేన్‌గా అభివృద్ధి చేస్తానని, ఇక్కడ అన్న క్యాంటీన్‌ను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

వార్నింగ్‌లు ఉండవ్.. చర్యలే

అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించకున్నా, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించినా, అవినీతికి పాల్పడినా వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత హెచ్చరించారు. దీపం-2 పథకం ప్రారంభం సందర్భంగా కొంతమంది స్థానిక అధికారుల పనితీరుపట్ల తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల్లో ఇంకా పాతవాసన బాగా ఉందని, ఇప్పటికైనా నిర్లిప్తత వీడాలన్నారు. తాను ఎక్కడ ఉన్నప్పటికీ పాయకరావుపేట నియోజకవర్గంలో ఏ అధికారి ఎలా పనిచేస్తున్నారో ఎప్పటికప్పుడు తనకు తెలుస్తుందన్నారు. సస్పెండ్ చేయించే పరిస్థితిని తీసుకురావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీఓ జయప్రకాశరావు, కూటమి పార్టీల నాయకులు తోట నగేశ్, గెడ్డం బుజ్జి, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, లాలం కాశీనాయుడు, పెదిరెడ్డి శ్రీను, చింతకాయల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పందూరులో ఇసుక వేలం పాట

... 3వ పేజీ తరువాయి

పందూరు వద్ద ఇసుక నిల్వలు పుష్కలంగా వుండడం, ఇసుకకు గిరాకీ ఏర్పడడంతో స్థానిక వైసీపీ, టీడీపీ నాయకులు ఒక్కటయ్యారు. ఇసుక తవ్వకాలు, అమ్మకం కోసం వేలం పాట నిర్వహించి, ఎవరు ఎక్కువకు పాడుకుంటే వారికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. గత నెల 30వ తేదీన రామాలయంలో సమావేశం ఏర్పాటు చేసి వేలం పాట నిర్వహించారు. వైసీపీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఒకరు రూ.17.2 లక్షలకు పాడుకున్నట్టు తెలిసింది. ఆ మరుసటి రోజు నుంచే ఇసుక తవ్వకాలు, అమ్మకాలు చేపట్టారు. ఇసుక అవసరమైన వేరే గ్రామాలకు చెందిన వ్యక్తులు సొంతంగా ట్రాక్టర్, కూలీలను ఏర్పాటు చేసుకుంటే.. ట్రాక్టర్ ఇసుకకు రూ.2 వేలు చెల్లించాలి. స్థానికులపై ఒకింత కనికరంచూపి రూ.500 మాత్రమే వసూలు చేస్తున్నారు. పక్కనే వున్న ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలకు చెందిన పలువురు ట్రాక్టర్ యాజమానులు, కూలీలను ఏర్పాటు చేసుకుని పందూరు నుంచి ఇసుక తీసుకెళుతున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.6-8 వేలకు అమ్ముకుంటున్నారు. ఖర్చులు పోను ఒక్కో ట్రిప్పునకు రూ.3-4 వేలు మిగులుతుండడంతో శుక్రవారం పందూరులో ఇసుక రీచ్ (అనధికారిక) వద్ద పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు బారులు తీరాయి. కాగా పందూరు వద్ద వరహా నదిలో ఇసుక అక్రమ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు.

క్రైం... crime news

కేఎన్ఆర్‌పేటలో యువకుడి హత్య

- పరారీలో నిందితులు
- మృతుడి స్వస్థలం యూపీ



వినోద్‌కుమార్ (ఫైల్ ఫొటో)

కొత్తూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఒక యువకుడిపై అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేటకు చెందిన ఇద్దరు యువకులు దాడి చేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయబరేలి జిల్లా గున్వార్ కమెగర్‌పూర్ ప్రాంతానికి చెందిన వినోద్‌కుమార్(22) రెండేళ్ల నుంచి కొప్పాక పారిశ్రామికవాడలోని ఒక కంపెనీలో పని చేస్తున్నాడు. స్థానికంగానే నివాసం వుంటున్న ఇతను గురువారం రాత్రి కొత్తూరు నర్సింగరావుపేటలో ఉన్న మద్యం దుకాణం వద్దకు తన సోదరుడు అమిత్‌కుమార్, దగ్గర బంధువైన రామ్‌గోపాల్ కలిసి వెళ్లాడు. తిరిగి వస్తూ.. పక్కనే ఉన్న ఒక షాపులో వాటర్ బాటిల్ కొనుగోలు చేస్తుండగా అక్కడే వున్న కొత్తూరు నర్సింగరావుపేటకు చెందిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకడు.. వినోద్‌కుమార్ తలపై కొట్టాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి గొడవ పడ్డారు. స్థానికులు కలుగజేసుకొని అక్కడి నుంచి పంపించేశారు. తరువాత మరలా ఆ ఇద్దరు వ్యక్తులు వచ్చి వినోద్‌కుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు 108కు ఫోన్ చేయడంతో అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. ఇతని సోదరుడు అమిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు. హత్యకు కారణమైన ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.

శారదా నదిలో పడి యువకుడి మృతి



ద్వారపూడి రాకేశ్ (ఫైల్‌ఫొటో)

మునగపాక (తుమ్మపాల), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శారదా నదిలో పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి మునగపాక ఎస్ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మెలిపాక గ్రామానికి చెందిన ద్వారపూడి రాకేశ్ (21) ఈ నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లి వరలక్ష్మి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుగా నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. చినయాదగిరిపాలెం వద్ద శారదా నదిలో యువకుడి మృతదేహం వున్నట్టు శుక్రవారం స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. మృతుడు రాకేశ్‌గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

పండుగ పూట విషాదం

- దీపావళికి సీరియల్ సెట్ లైట్లు కడుతుండగా విద్యుదాఘాతం
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందిన వ్యాపారి



మంత్రి సుధాకర్ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ పూట ఆ ఇంట విషాద చీకట్లు అలుముకున్నాయి. ఇంటికి విద్యుత్ తోరణాలతో అలంకరించి వెలుగులు నింపాలనుకున్న వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు జీర్ణించుకో లేకపోతున్నారు. శుక్రవారం పట్టణ సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.

నర్సీపట్నం బీసీ కాలనీకి చెందిన మంత్రి సుధాకర్ ఏజెన్సీలో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం దీపావళి సందర్భంగా సాయంత్రం ఇంటికి విద్యుత్ సీరియల్ సెట్ లైట్లుతో అలంకరిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. బంధువులు సుధాకర్‌ని హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

నక్కపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నక్కపల్లి హైవే జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెంది గంగాధర్ సాహూ కొంతకాలంగా హెటిరో పరిశ్రమలో పనిచేస్తున్నాడు. నక్కపల్లి రెల్లి కాలనీకి సమీపంలో నివాసం వుంటున్న ఇతను గురువారం రాత్రి సొంతపనిమీద బైక్‌పై జాతీయ రహదారికి వస్తున్నాడు. ఈ క్రమంలో హైస్కూల్ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

భూతగాదాలో తండ్రీకొడుకులకు గాయాలు

దేవరాపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకపల్లి గ్రామంలో జరిగిన భూ తగాదాలో తండ్రీకొడుకులు గాయపడ్డారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని వాకపల్లి గ్రామంలో తమడాన సూర్యనారాయణ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన బుగత భీమునాయుడు కుటుంబానికి కొంత కాలంగా భూతగాదా ఉంది. గ్రామ పెద్దల సమక్షంలోనూ ఇరు వర్గాల మధ్య రాజీ యత్నాలు జరిగాయి. బుధవారం తమ పొలంలో సరుగుడు మొక్కల్ని భీమునాయుడు పశువులు మేశాయంటూ సూర్యనారాయణకు అతని తండ్రి అప్పారావు ఫోన్‌లో చెప్పాడు. వెంటనే విశాఖలో ఉంటున్న సూర్యనారాయణ ద్విచక్ర వాహనంపై పొలానికి వచ్చాడు. పశువులు మేసిన సరుగుడు మొక్కల్ని చూసి అక్కడే ఉన్న భీమునాయుడును ప్రశ్నించాడు. దీంతో సూర్యనారాయణ, తండ్రి అప్పారావుపై భీమునాయుడు, అతని భార్య లక్ష్మి, కుమారుడు కార్తీక్, కుమార్తె రోహిణి దాడికి దిగారు. అతని కళ్లల్లో ఇసుక కొట్టి రాయితో తలపై బలంగా బాదారు. కాగా తనపైన, తన భర్త భీమునాయుడుపైన సూర్యనారాయణ దాడి చేశాడంటూ బుగత లక్ష్మి ఫిర్యాదు చేసింది. అందిన రెండు ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. తీవ్రంగా గాయపడిన సూర్యనారాయణను కె.కోటపాడు ఆస్పత్రికి తరలించామన్నారు.

పది కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

కృష్ణాదేవిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పది కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కృష్ణాదేవిపేట చెరకు కాటా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైక్‌లపై వస్తున్న వారి బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి దొరికిందన్నారు. జి.మాడుగుల మండలం సంగులోవకు చెందిన కొండపల్లి చంద్రశేఖర్, కొండపల్లి లక్ష్మణరావులను అరెస్టు చేశామన్నారు. పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వీరిని విశాఖపట్నం సెంటల్ జైలుకు తరలించామన్నారు.

ఖాళీ కంచాలతో అభిజిత్ కార్మికులు నిరసన



అచ్యుతాపురం జంక్షన్‌లో ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న అభిజిత్ కార్మికులు

అచ్యుతాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ కార్మికులు దీపావళి పండుగనాడు ఖాళీ కంచాలతో అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, దీపావళి రోజున అందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా వున్నారని, తాము మాత్రం జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. యాజమాన్యం అక్రమ లేఆఫ్ ప్రకటించిందని, 18 రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యంగానీ, అధికారులుగానీ పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరారు.